పోలీసుల 'ఆపరేషన్ కవచ్'

-నంబర్ ప్లేట్ల ట్యాంపరింగ్‌పై ఉక్కుపాదం
-నియమాలు ఉల్లంఘించిన 2,149 వాహనాల స్వాధీనం
-వాహనాల తనిఖీని స్వయంగా పరిశీలించిన సిపి వీసీ సజ్జనార్

వాహనాల తనిఖీని స్వయంగా పరిశీలిస్తున్న నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్

హైదరాబాద్, జూన్ 5 ప్రభాతవార్త

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా నగరవ్యాప్తంగా 'ఆపరేషన్ కవచ్' పేరిట హైదరాబాద్ సిటీ పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. రాత్రి 10 గంటల నుంచి 12 గంటల వరకు జరిగిన ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా, వాహనాల నంబర్ ప్లేట్ల ట్యాంపరింగ్‌పై ప్రధానంగా దృష్టి సారించారు. ఈ విధమైన ట్యాంపరింగ్ నేరగాళ్లకు సులభంగా తప్పించుకునే మార్గంగా మారడమే కాకుండా, అమాయకులను తప్పుడు ఈచలాన్లు, కేసుల గుప్పిట్లోకి నెడుతూ శాంతిభద్రతలకు తీవ్ర సవాల్‌గా పరిణమిస్తోంది. ఈ ముప్పును అరికట్టడానికి ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక కీలక ప్రాంతాన్ని ఎంచుకుని, లా అండ్ ఆర్డర్ సిబ్బంది రోడ్లపై ఉండి ఈ తనిఖీలు నిర్వహించారు. జూబ్లీ హిల్స్, వెంకటగిరి, మధురానగర్, కృష్ణకాంత్ పార్క్, బోరబండ పిలీదర్గా, సనత్‌నగర్, అమీర్‌పేట్ సత్యం థియేటర్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెకింగ్ పాయింట్లను నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ సందర్శించారు. క్షేత్రస్థాయిలో తనిఖీల సరళిని పరిశీలించిన ఆయన, స్వయంగా కొన్ని వాహనాలను ఆపి నంబర్ ప్లేట్లను నిశితంగా పరిశీలించారు. నంబర్ ప్లేట్లు సరిగ్గా లేని వాహనదారులతో నేరుగా మాట్లాడి, నిబంధనలు పాటించకపోవడానికి గల కారణాలను ఆరా తీశారు. నిబంధనల ప్రకారం నంబర్ ప్లేట్లు కలిగి ఉండటం ఎంత ముఖ్యమో వారికి వివరించారు. అనంతరం, ఉద్దేశపూర్వకంగా నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అక్కడి సిబ్బందిని ఆదేశించారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా నగరవ్యాప్తంగా వివిధ జోన్లలో కలిపి మొత్తం 12,098 వాహనాలను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఇందులో 8,802 ద్విచక్ర వాహనాలు, 1,693 నాలుగు చక్రాల వాహనాలు, 1,623 ఆటోలు ఉన్నాయి. ఈ తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు ఉన్న 1,406 వాహనాలను, అసలు నంబర్ ప్లేట్ లేని 1,132 వాహనాలను, నకిలీ నంబర్ ప్లేట్లతో తిరుగుతున్న 69 వాహనాలను పోలీసులు గుర్తించారు. నిబంధనలను ఉల్లంఘించినందుకు గాను మొత్తం 2,149 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అందులో 2,046 ద్విచక్ర వాహనాలు, 52 ఫోర్ వీలర్స్, 51 ఆటోలు ఉన్నాయి. జోన్ల వారీగా చూస్తే.. గరిష్టంగా రాజేంద్రనగర్ జోన్‌లో 2,376, సికింద్రాబాద్ జోన్‌లో 2,230, చార్మినార్ జోన్‌లో 2,171 వాహనాలను తనిఖీ చేయగా, స్వాధీనం చేసుకున్న వాటిలో అత్యధికంగా గోల్కొండ జోన్ పరిధిలో 530, చార్మినార్ జోన్ పరిధిలో 444 వాహనాలు ఉన్నాయి. ఈ సందర్భంగా సజ్జనర్ మాట్లాడుతూ నగర ప్రజల రక్షణ కోసం ఆపరేషన్ కవచ్‌ను చేపట్టినట్లు చెప్పారు. నంబర్ ప్లేట్ల ట్యాంపరింగ్‌ను కేవలం సాధారణ ట్రాఫిక్ ఉల్లంఘనగా పరిగణించబోమని స్పష్టం చేశారు. నంబర్ ప్లేట్లను ఉద్దేశపూర్వకంగా మార్చడం లేదా అస్పష్టంగా ఉంచడం సమాజ భద్రతకే పెను ముప్పు అని పేర్కొన్నారు. నేరస్థులు పోలీసుల నుంచి తప్పించుకోవడానికి నంబర్ ప్లేట్లను వంచడం, అక్షరాలను చెరిపేయడం లేదా నకిలీ నంబర్లను వాడుతుంటారని తెలిపారు. దీని వల్ల అమాయక వాహనదారులకు తప్పుడు ఈ చలాన్లు వెళ్లడమే కాకుండా, కొన్నిసార్లు వారు క్లిష్టమైన కేసుల్లో చిక్కుకునే ప్రమాదం ఉందన్నారు. నంబర్ ప్లేట్ ట్యాంపరింగ్‌కు పాల్పడే వారిపై చీటింగ్, ఫోర్జరీ కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తూ, రవాణా శాఖ నిబంధనల ప్రకారం నంబర్ ప్లేట్లను స్పష్టంగా ఉంచుకోవాలని వాహనదారులకు సూచించారు. వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు సంబంధిత ధ్రువపత్రాలను వెంటనే ఉంచుకోవాలన్నారు. ఈ తనిఖీల్లో అదనపు సీపీ క్రైమ్స్ యం.శ్రీనివాసులు, అదనపు సీపీ లా అండ్ ఆర్డం తఫ్సీర్ ఇక్బాల్, జాయింట్ సీపీ ట్రాఫిక్ డి.జోయల్ డేవిస్, జాయింట్ సీపీ లా అండ్ ఆర్డర్ నార్త్ రేంజ్ ఎన్.శ్వేత, డీసీపీ సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ ఆర్. వెంకటేశ్వర్లు, డీసీపీ క్రైమ్స్ ఎస్.చైతన్య కుమార్, అన్ని జోన్ల డీసీపీలు కిరణ్ ఖారే, కె.శిల్పవల్లి, ఎస్.శ్రీనివాస్, జి.చంద్రమోహన్, ఎ.రమణారెడ్డి, బి. రాజేష్, సైబర్ క్రైమ్స్ వి.అరవింద్ బాబు, డీసీపీ విమెన్ సేఫ్టీవింగ్, లావణ్య నాయక్ జాదవ్, పాల్గొన్నారు.

హైదరాబాద్ వార్త

రేపటి భవిష్యత్‌ను నిలబెడదాం

-మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సదర్భంగా కృష్ణకాంత్‌పార్క్ వద్ద మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే నవీన్ యాదవ్.

యూసుఫ్‌గూడ, 5 జూన్, ప్రభాతవార్త :

పర్యావరణ రక్షణ అనేది కేవలం ప్రభుత్వ కార్యక్రమాల్లో భాగంగా కాకుండా ప్రతి ఒక్కరి రోజువారి జీవితంలో భాగం కావాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వెంగళ్‌రావునగర్ డివిజన్ పరిధిలోని కృష్ణకాంత్ పార్క్‌లో మొక్కలు నాటే కార్యక్రమంలో హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ జూబ్లీహిల్స్ శాసనసభ్యులు నవీన్ యాదవ్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలా, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల్లో భాగంగా 12 రోజులు ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌లో కార్యక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంతో తమకు సంబంధం లేదని ఎవరూ అనుకోవద్దని అశోక్ చక్రవర్తి ఆనాడు మొక్కలు నాటారని ఈ రోజు మనం జ్ఞాపకం చేసుకుంటున్నామన్నారు. భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరు విధిగా మొక్కలు నాటాలని సూచించారు. ఢిల్లీలో కాలుష్య కోరల్లో చిక్కుకుందని హైదరాబాద్‌లో అలాంటి పరిస్థితి రావద్దని రాష్ట్ర ప్రభుత్వ భావిస్తుందన్నారు. ఈవీ వాహనాలు వాటం వల్ల పొల్యూషన్ తగ్గించి పర్యావరణాన్ని కాపాడుకోవచ్చన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండు వేల మొక్కలు నాటే కార్యక్రమం ఈ రోజు జరుగుతుందన్నారు. భవిష్యత్‌లో వర్షాలు రాకుండా ఉండే పరిస్థితి ఏర్పడుతుందని ప్రతి ఒక్కరు నీటిని ఆదా చేయాలని సూచించారు. ఎక్కడైనా బోర్లు వేస్తే నీరు వచ్చే పరిస్థితి లేదని ప్రతి ఇంట్లో బాధ్యతగల ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్లాస్టిక్‌ను నియంత్రించాలని తెలిపారు. నియోజకవర్గంలో హోటల్లో కూడా స్టీల్ గ్లాసులు వాడేవిధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తాను కూడా స్వయంగా స్టీలు గ్లాసు వాడతానని తెలిపారు. ప్లాస్టిక్ వాడొద్దని ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. కుటుంబంలో ప్రతి ఒక్కరు ఆస్తులు భవిష్యత్ తరాలకు ఇస్తారు. సమాజానికి ఏమి ఇచ్చావు అంటే మంచి నేచర్ ఇచ్చామని చెప్పగలిగామని అనాలి అన్నారు. ఈ ప్రాంతంలో డంపింగ్ యార్డ్ సమస్య తీవ్రంగా ఉందని తమ దృష్టికి తీసుకువచ్చారని ప్లాస్టిక్ వాడం వల్లే ఈ డంప్ యార్డ్ సమస్యలు తలెత్తుతున్నాయని. ప్లాస్టికి వాడమని ప్రతి ఒక్కరు ప్రమాణం చేసుకోవాలని తెలిపారు.

7న ఎంఎంసి నూతన ప్రధాన కార్యాలయ భవనానికి శంకుస్థాపన

-సిఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా కార్యక్రమం -ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి

అధికారులకు సూచనలు ఇస్తున్న కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

హైదరాబాద్, జూన్ 5 ప్రభాతవార్త :

మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) నూతన ప్రధాన కార్యాలయ భవన నిర్మాణానికి జూన్ 7న శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమం ఘనంగా జరగనుంది. ఈ నేపథ్యంలో ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి ఉప్పల్ భగాయత్‌లోని కార్యక్రమ స్థలాన్ని సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. జోనల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసు విభాగం, వాటర్ వర్క్స్ శాఖ ప్రతినిధులతో కలిసి కార్యక్రమ నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించారు. వేదిక నిర్మాణం, అతిథుల కూర్చునే ఏర్పాట్లు, పార్కింగ్ సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, విద్యుత్ సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరుకానున్న నేపథ్యంలో ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిషనర్ సూచించారు. ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో జోనల్ కమిషనర్లు రాధిక గుప్తా, సంచిత్ గంగ్వార్, వికాస్ మహతో, అదనపు కమిషనర్లు రఘు ప్రసాద్, వేణుగోపాల్, చీఫ్ ఇంజనీర్ అశోక్ రెడ్డి, డైరెక్టర్ యూబీడీ సునంద, ఎస్ఈ శ్రీనివాస్ రావు, ఈఈలు రోహిణి, రమేష్ బాబు, పీడీ యూసీడీ సురేష్ కుమార్, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ ఎంటమాలజిస్ట్ మాధవ రెడ్డి, బోడుప్పల్ డిప్యూటీ కమిషనర్ శైలజ పాల్గొన్నారు.

188 వాటర్ లాగింగ్ పాయింట్లు

-సమన్వయంతో పనిచేస్తే సమస్యలు పరిష్కారం
-వర్షాకాల సన్నద్ధతపై హైడ్రా ఎంసీ సమావేశం
-హాజరైన కమిషనర్లు రంగనాథ్, వినయ్‌కృష్ణారెడ్డి

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఎంఎంసి కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి తదితరులు

హైదరాబాద్, జూన్ 5,ప్రభాతవార్త:

వర్షాకాలంలో నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బంది రాకుండా అన్ని శాఖలకు చెందిన అధికారులు సమన్వయంతో పని చేయాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ సూచించారు. వర్షాకాలం నీట మునకకు సంబంధించి ఎక్కడ ఏ సమస్య తలెత్తినా హైడ్రా దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జీహెచ్ఎంసీ, సీఎంసీ పరిధిలోని అన్ని విభాగాల అధికారులతో వర్షాకాల సన్నద్ధతపై ఇప్పటికే సమీక్షించిన కమిషనర్ తాజాగా సిఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డితో కలిసి మల్కాజిగిరి మున్సిపల్ పరిధిలో వచ్చే ఇబ్బందులపై చర్చించారు. ఎంఎంసీ పరిధిలో 188 వాటర్ లాగింగ్ పాయింట్లుంటే.. అందులో మేజర్ 69, మీడియం 39, మైనర్ సమస్యలున్నవి 80 వరకూ ఉన్నాయన్నారు. డీఆర్ ఎఫ్ కు చెందిన 5 మందితో ఉన్న టీమ్‌లు 12, మాన్సూన్ ఎమర్జన్సీ టీమ్‌లు 74 (ఒక్కో టీమ్‌లో నలుగురు), 175 మంది స్టాటిక్ సిబ్బంది నిత్యం క్షేత్రస్థాయిలో పని చేస్తారని అవసరమైతే పెంచుతామన్నారు. వీళ్లతో పాటు.. హైడ్రా ఎస్ ఎఫ్ వోలుంటారు. హైడ్రా, మున్సిపల్ కార్పొరేషన్, ట్రాఫిక్ పోలీసులు, జలమండలి, ఇరిగేషన్, విద్యుత్ శాఖ, యూబీడీ శాఖలతో నిరంతర సమన్వయం కొనసాగిస్తూ సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విభాగాలకు చెందిన అధికారులతో కమిషనరేట్ నుంచి డివిజన్ వరకూ వివిధ స్థాయిల్లో కమిటీలు ఏర్పాటు చేసుకుని సమన్వయంగా పని చేయాలని హైడ్రా కమిషనర్ సూచించారు. ప్రమాదాలకు కారణమయ్యే శిథిలావస్థలో ఉన్న భవనాలు, భారీ ప్రకటన బోర్డులను గుర్తించి తగిన చర్యలు చేపట్టాలన్నారు.

9 చెరువులకు ఫ్లడ్ గేట్లు అమర్చాలి : వినయ్‌కృష్ణారెడ్డి

మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌లో 9 చెరువులకు ఫ్లడ్ గేట్లు అమర్చాల్సిన అవసరం ఉందని కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి కోరారు. కార్పొరేషన్లో 14 సర్కిళ్లున్నాయని.. 12 డీఆర్ ఎఫ్ బృందాలకు తోడు మరో రెండు పెంచి 14 చేయాలని హైడ్రా కమిషనర్‌ను అడిగారు. మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం వరద కాలువలన్నీ పూడిక తీసే పనులు పూర్తి చేశామని వర్షాకాలంలో ఇబ్బందులను పరిష్కరించడానికి అన్ని విభాగాలతో కలసి పని చేస్తామన్నారు. నాలాల నెట్‌వర్క్ మ్యాపింగ్ పూర్తి చేయడం ద్వారా వర్షపు నీటి ప్రవాహాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చునని హైడ్రా కమిషనర్ తెలిపారు. మ్యాన్‌హోళ్లు ఎక్కడున్నాయనేది ఆ దగ్గర్లోని గోడలపై మార్కింగ్ చేస్తే.. వరద సమయంలో ఇబ్బందులు పరిష్కరించవచ్చన్నారు. హైడ్రా కంట్రోల్ రూమ్‌ను కేంద్ర బిందువుగా చేసుకుని వాతావరణ హెచ్చరికలు, అత్యవసర సమాచారాన్ని సంబంధిత శాఖలకు తక్షణం చేరవేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ముందస్తు ప్రణాళికతో సమన్వయంగా పని చేస్తే వర్షాకాల సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చునని తెలిపారు. అంతకు ముందు వాటర్‌లాగింగ్ పాయింట్లతో పాటు డీసిల్టింగ్ పనులను, మెట్ టీమ్‌లు ఎలా పని చేస్తాయో హైడ్రా అడిషనల్ డైరెక్టర్ వర్ల పాపయ్య వివరించారు. ఈసమావేశంలో హైడ్రా అడిషనల్ కమిషనర్ ఆర్ సుదర్శన్ ట్రాఫిక్ డీసీపీలు, ఎంఎంసీ జోనల్ కమిషనర్లు, ఇరిగేషన్, విద్యుత్ శాఖ, జలమండలి, జాతీయ రహదారులు, యూబీడీ, కంటోన్మెంట్ అధికారులు పాల్గొన్నారు.

అనుమానంతో భార్యపై కత్తితో దాడి

-చికిత్స పొందుతూ మృతి ..

అత్తాపూర్ జూన్ 5,ప్రభాతవార్త :

అత్తాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలోని తేజస్వి నగర్ కాలనీలో దారుణ ఘటన చోటుచేసుకుంది. కట్టుకున్న భార్య కోమల్‌పై అనుమానంతో భర్త అవినాశ్ కత్తితో దాడి చేయగా తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆస్పత్రికి తరలించగా మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. దంపతులకు ఇద్దరు కుమారులు ఉండగా, కుటుంబ కలహాలు ఈ ఘాతుకానికి దారితీసినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు క్లూస్ టీం ఆధారాలను సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కుమారుడు బతిమాలిన...

తల్లి కోమలను తండ్రి చంపిన ఘటన గురించి కుమారుడు చెప్పిన తీరు ఒళ్లు గుగుర్లు పొడుస్తోంది. రాత్రి 3గం.కు వరకు గొడవ జరిగిందని కోపంగా అమ్మపై కత్తితో దాడిచేశాడు. పారిపోగా వెంటాడి స్క్రూడైవర్, రాడ్‌తో కిరాతకంగా దాడిచేశాడు. నాన్న కొట్టకు అని ఆడ్డుకున్నా వినకుండా దాడి చేశాడంటూ ఆవేదన వ్యక్తం చేశారు. చివరికి హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ 5నిమిషాలో మృతి చెందిందని కంట తడి పెట్టాడు.

అగ్ని ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు : హైడ్రా కమిషనర్

అమీర్‌పేట ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్

సంజీవరెడ్డి నగర్, జూన్ 5, ప్రభాతవార్త:

నగరంలో తరచూ జరుగుతున్న అగ్ని ప్రమాదాల నివారణపై హైడ్రా ప్రత్యేక దృష్టి సారించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత శాఖలతో ఇప్పటికే పలు సమావేశాలు నిర్వహించగా, అగ్ని ప్రమాదాల నివారణకు సంబంధించిన విధివిధానాల రూపకల్పనపై కసరత్తు కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో సోమవారం కీలక సమావేశం నిర్వహించనున్నట్లు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. గురువారం అమీర్‌పేట మైత్రేయివనం సమీపంలోని వెస్ట్ శ్రీనివాసనగర్‌లో అగ్ని ప్రమాదానికి గురైన షాపింగ్ కాంప్లెక్స్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పాత విద్యుత్ వైరింగ్, సామర్థ్యానికి మించి విద్యుత్ వినియోగం కారణంగా షార్ట్ సర్క్యూట్లు ఏర్పడి అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. అమీర్‌పేటలో జరిగిన తాజా ఘటనకు సంబంధించి సమీపంలోని మెస్ చిమ్నీల నుంచి వచ్చిన నిప్పురవ్వలు కారణమని కొందరు చెబుతుండగా, మరోవైపు షార్ట్ సర్క్యూట్ కారణమని కూడా భావిస్తున్నారని తెలిపారు. ఘటనపై పూర్తి స్థాయి దర్యాప్తు కొనసాగుతోందన్నారు. అగ్ని ప్రమాదాల నియంత్రణకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోనున్నదని, ఫైర్ ఎన్‌వోసీల జారీ, తనిఖీల నిర్వహణ, నిబంధనలు పాటించని వారిపై చర్యలు వంటి అంశాల్లో కీలక మార్పులు తీసుకురానున్నట్లు కమిషనర్ వెల్లడించారు. నగరంలోని అనేక భవనాలు, వాణిజ్య సముదాయాలకు ఫైర్ ఎన్‌వోసీలు లేవని, వాటిని పరిశీలించి నిబంధనలు అమలు అయ్యేలా చర్యలు చేపడతామని చెప్పారు. అలాగే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వరద కాలువలపై నిర్మాణాల వల్ల నీటి ప్రవాహానికి ఆటంకం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ పరిశీలనలో హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్య, ఆర్‌ఎఫ్‌వో జయప్రకాశ్, ఎస్‌ఎఫ్‌వోలు తదితర అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల రక్షణకు చర్యలు తీసుకోవాలి : కలెక్టర్



హైదరాబాద్, జూన్ 5,ప్రభాతవార్త:

జిల్లాలో మెరుగైన రెవిన్యూ సేవలందాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా రెవిన్యూ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని వివిధ రెవెన్యూ అంశాలపై జిల్లా కలెక్టర్ శుక్రవారం కలెక్టరేట్‌లో రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ రికార్డుల సర్వే, డిజిటలైజేషన్, జిల్లా ల్యాండ్ బ్యాంక్‌ను ఆన్‌లైన్ డిజిటల్ పోర్టల్‌లో నిర్వహించడం, భూములకు సంబంధించిన సమాచారాన్ని నిరంతరం నవీకరించడం వంటి అంశాలను కూడా సమీక్షించారు. ప్రభుత్వ భూములపై ఆక్రమణలు, ఎన్‌కంబ్రెన్సులు, కోర్టు కేసులు మరియు ప్రభుత్వ భూముల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. ప్రభుత్వ భూముల లీజుల ద్వారా రావాల్సిన అద్దెల వసూళ్ల పురోగతిని కూడా సమీక్షించిన కలెక్టర్, బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ జిల్లాలో గృహ నిర్మాణ కార్యక్రమం అత్యంత ముఖ్యమైన అంశమని అన్నారు. గృహ నిర్మాణ పథకానికి సంబంధించిన అన్ని పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కదిరవన్ పలాని, జిల్లా రెవెన్యూ అధికారి నారాయణ, హైదరాబాద్ ఆర్డీవో రామకృష్ణ, సికింద్రాబాద్ ఆర్డీవో సాయిరాం, హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ అశోక్ చక్రవర్తి, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు, డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ అధికారులు, అన్ని మండలాల తహసీల్దార్లు, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్లు మరియు ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

బినామీ లావాదేవీలు చేయడం చట్టవిరుద్ధం

-అదనపు ఆదాయపు పన్ను కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి

టీజీ, ఏపీ ట్యాక్స్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న అదనపు ఆదాయపు పన్ను కమిషనర్ వై.శ్రీకాంత్‌రెడ్డి, చిత్రంలో అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ వేముల తదితరులు ఉన్నారు.

హైదరాబాద్, జూన్ 6 ప్రభాతవార్త

దేశ పౌరులు బినామీ లావాదేవీలు చేయడం చట్టవిరుద్ధమని, బినామీగా ఉన్న ఏ ఆస్తి అయినా, దాని యజమానికి ఎలాంటి నష్టపరిహారం చెల్లించకుండా కేంద్ర ప్రభుత్వం జప్తు చేస్తుందని తెలంగాణ, ఏపీ అదనపు ఆదాయపు పన్ను కమిషనర్ వై.శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. వాస్తవ యజమాని, బినామీదారు ఇద్దరికీ బినామీ ఆస్తి లావాదేవీల నిషేధ చట్టం, 1988 ప్రకారం కఠినమైన జైలు శిక్ష తప్పదని, బినామీగా ఉన్న ఆస్తులను తిరిగి పొందేందుకు అసలు యజమానులు కోర్టుల్లో దావాలు కూడా వేయలేరని తెలిపారు. సికింద్రాబాద్‌లో శుక్రవారం టీజీ, ఏపీ ట్యాక్స్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'భారతదేశంలో బినామీ చట్టం పాటించడం, దర్యాప్తు తీర్పు' అనే అంశంపై సీఏ సాంబమూర్తి అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ సదస్సులో వై.శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ నల్లధనాన్ని అరికట్టే ప్రయత్నంలో 2016 లో మోదీ ప్రభుత్వం బినామీ ఆస్తి లావాదేవీల నిషేధ చట్టం తీసుకవచ్చిందన్నారు. బినామీ లావాదేవీలు కేంద్ర ప్రభుత్వం నిషేదించింది కాబట్టి పౌరులు తమ పన్నులను సకాలంలో చెల్లించాలని మరియు బినామీ ఆస్తిని బహిర్గతం చేయాలనీ లేకుంటే సర్వం ఆస్తిని కోల్పోయే ప్రమాదాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని వై. శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షులడు సీఏ చంద్రశేఖర్ వేముల మాట్లాడుతూ బినామీ లావాదేవీలను అరికట్టడానికి చార్టర్డ్ అకౌంటెంట్లుగా పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఆస్తి పత్రాలు ఆడిట్ చేయించడంలో ఏదైనా అసాధారణ విషయాన్నీ గుర్తిస్తే వెంటనే పన్ను అధికారులకు అప్రమత్తం చేస్తామన్నారు. చార్టర్డ్ అకౌంటెంట్లు, పన్ను అధికారులతో సమన్వయంతో పని చేస్తారని, బినామీ లావాదేవీలు ప్రమాదకరమని, ప్రజలు వీటికి దూరంగా ఉండాలని, కుటుంబ సభ్యుల మధ్య తెలియకుండానే కొన్ని బినామీ లావాదేవీలు జరిగే అవకాశం ఉందని కూడా ప్రజలు గమనించాలని, అన్ని ఆర్థిక లావాదేవీలకు సంబంధించి తమ ఆడిటర్ల నుండి సరైన సలహాలు తీసుకోవాలని పౌరులకు సీఏ చంద్రశేఖర్ వేముల సూచించారు. ఈ సదస్సులో అసోసియేషన్ కార్యదర్శి సీఏ ఆశిష్ జోషి, కోశాధికారి సోమేశ్వర్ నెమ్మాని, సలహాదారు సీఏ రామ్‌దేవ్ బుటాడా, కంపిటేషన్ కమిటీ చైర్మన్ సీఏ అమృత్ కుమార్ కోటా, ఉపాధ్యక్షులు సీఏ పి.వి. నారాయణరావు, మాజీ అధ్యక్షులు సీఏ హితేష్ జైన్, సీఏ పూర్ణచంద్రరావు, గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు సీఏ రమణరెడ్డి, సీఏ ప్రవల్లిక వేముల, సిఏ ప్రకాష్ చోకదా, సీఏ వెంకట్‌రామ్, సీఏ శైలేంద్ర శర్మ, సిఏలీల కృష్ణ మోహన్ ఎన్.వి.చారి, అజయ్ వాల్యే, ఏపీ దహిమా తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

హయత్ నగర్, జూన్ 5 ప్రభాతవార్త :

ఇంటర్ విద్యార్థి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు... హనుమకొండ కు చెందిన కోమటిరెడ్డి దేవేందర్ రెడ్డి (17) కోహెడలోని చైతన్య కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మొదటి సంవత్సరం పరీక్షల అనంతరం హనుమకొండకి వెళ్లిన అతన్ని తండ్రి జలపతిరెడ్డి ఈనెల 2న తిరిగి కళాశాలకు తీసుకువచ్చాడు. గురువారం రాత్రి అందరు భోజనాలకు వెళ్ళగా దేవేందర్ రెడ్డి గదిలోనే ఉన్నాడు. స్టడీ అవర్ అనంతరం 9 గంటల సమయంలో స్నేహితులు గదిలోకి వచ్చి చూడగా అతను టవల్, బేడీషీట్ తో ఫ్యాన్ కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. విద్యార్థులు వెంటనే వార్డెన్‌కు చెప్పగా.. కళాశాల ప్రతినిధులు అతన్ని హయత్ నగర్ లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అతన్ని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఇంటర్ మొదటి ఏడాదిలో దేవేందర్ రెడ్డి కి 466/470 మార్కులు వచ్చాయి. అతని ఆత్మహత్య కు గల కారణాలు తెలియ రాలేదు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కందికల్‌గేట్-గౌలిపురా రోడ్డు విస్తరణపై చర్యలు చేపట్టండి

సౌత్‌జోన్ చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీనివాస్‌రావుతో చర్చిస్తున్న మాజీ కార్పొరేటర్ ఆలె జితేంద్ర

చాంద్రాయణగుట్ట, జూన్ 5, ప్రభాతవార్త : పాతబస్తీలోని కందికల్‌గేట్ నుండి గౌలిపురా వరకు నిలిచిపోయిన రోడ్డు విస్తరణ పనులను వెంటనే చేపట్టాలని, గౌలిపురా డివిజన్‌లో గత కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పూర్తికి తక్షణ చర్యలు తీసుకోవాలని గౌలిపురా డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆలె జితేంద్ర శుక్రవారం జీహెచ్‌ఎంసి సౌత్‌జోన్, టౌన్ ప్లానింగ్, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ సత్యనారాయణతో చర్చించారు. రోడ్డు విస్తరణ నిలిచిపోవటం వల్ల ఉన్న ప్రధాన రోడ్డు మరింత కుంచించుకుపోయి నిత్యం ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతుందని వివరించారు. తద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. రోడ్డు విస్తరణలో నష్టపోతున్న బాధితులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సాధ్యమైనంత తొందరగా విస్తరణ జరిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా త్వరలో ప్రారంభమైయ్యే వార్షాకాలంలో నాలాలు, కచ్చామోరీలలో పూడికను తొలగించి, వరద సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. అందుకు అధికారులు సానుకూలత వ్యక్తం చేశారు.

తాగు నీటి సమస్యపై డిజిఎంకు వినతి

బోరబండ సర్కిల్‌లో తాగు నీటి సమస్యపై డీజీఎమ్ సురేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు.

యూసుఫ్‌గూడ, 5 జూన్, ప్రభాతవార్త :
వేసవిలో తాగు నీటి సమస్య తీవ్రతరం కావడంతో స్థానిక బస్తీలలోని ప్రజలు దాహార్తితో అలమటిస్తుండటంతో బీజేపీ నాయకులు బోరబండలోని వాటర్ వర్క్స్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. బోరబండ సర్కిల్ పరిధిలోని రాజీవ్‌నగర్, కార్మికనగర్, రహమత్‌నగర్, కృష్ణానగర్‌తో పాటు పలు కాలనీలల్లో నెలకొన్న తీవ్రమైన తాగునీటి సమస్యపై భారతీయ జనతాపార్టీ బోరబండ డివిజన్ అధ్యక్షులు కొత్త వెంకటేష్ ఆధ్వర్యంలో స్థానిక నాయకులతో కలిసి వాటర్‌వర్క్స్ సర్కిల్ 37 డీజీఎమ్ సురేష్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. చాలా ప్రాంతాలలో కలుషిత నీరు సరఫరా జరుగుతుందని తక్కువ ప్రెషర్‌తో నీళ్లు రావడం నిర్ణీత సమయాల్లో కాకుండా ఇష్టాను సారంగా సరఫరా చేయడం మూడు నుంచి నాలుగు రోజుల కొకసారి మాత్రమే నీరు అందించటం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అదేవిధంగా తాగునీటి కోసం ప్రైవేట్ ట్యాంకర్లపై ఆధారపడవలసి వస్తుందని దీని వల్ల పేద మధ్య తరగతి కుటుంబాలపై అదనపు ఆర్థిక బారం పడుతుందని తెలిపారు. దీనిపై స్పందించిన డీజీఎమ్ సురేష్ సానుకూలంగా స్పందించి అధికారులతో సమన్వయం చేసుకుని తక్షణ చర్యలు చేపట్టి తాగునీటి సఫరాను మెరుగుపరుస్తామని హామీ ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వర్‌రావు, రాజ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, సురేష్‌గౌడ్, షర్మిల, చరణ్‌రెడ్డి, కృష్ణ, నాగేందర్, విజయ్, చంద్రశేఖర్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

డిగ్రీ అటానమస్ రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాల విడుదల

డిగ్రీ అటానమస్ రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాల విడుదల చేస్తున్న డాక్టర్ బి ఆర్ అంబెడ్కర్ విద్యాసంస్థల కరెస్పొండంట్ డాక్టర్ జి. సరోజా వివేక్

చిక్కడపల్లి జూన్ 5 (ప్రభాతవార్త) :
బాగ్ లింగంపల్లి డాక్టర్ బి ఆర్ అంబెడ్కర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం డిగ్రీ అటానమస్ రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విద్యాసంస్థల కరెస్పొండంట్ డాక్టర్ జి. సరోజా వివేక్ విడుదల చేసారు. కార్యక్రమంలో సీఈఓ ప్రొఫెసర్ లింబాద్రి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, శాఖాధిపతులతో కలిసి ఫలితాలను పరిశీలించిన అనంతరం ఉత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులోనూ ఇదే పట్టుదలతో మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్స్, హెచ్ఓడీలు, అధ్యాపకులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

కనీస వేతనాల పెంపుదల హర్షణీయం: ఐఎన్‌టీయూసీ

ప్రసంగిస్తున్న ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నేత ముత్యాల సత్యనారాయణ

చిక్కడపల్లి జూన్ 5 (ప్రభాతవార్త) :
తెలంగాణలోని అసంఘటిత రంగ కార్మికుల కనీస వేతనాలను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నేత ముత్యాల సత్యనారాయణ సంతోషం వ్యక్తం చేసింది. శుక్రవారం బాగ్ లింగంపల్లి లో జరిగిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ముత్యాల సత్యనారాయణ పాల్గొని ప్రసంగించారు. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత అసంఘటిత కార్మికులకు ఈ నిర్ణయం ద్వారా ఎంతో మేలు జరిగిందని పేర్కొన్నారు. కార్మికుల పక్షాన నిలిచిన సీఎం ఎ. రేవంత్ రెడ్డికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గత పదేళ్లుగా సరైన వేతన సవరణ లేక, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో అసంఘటిత కార్మికులు నానా ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం కనీస వేతనాలు పెంచడం కార్మికులకు ఈ కరుడు గట్టిన ఎండల్లో చల్లటి జల్లు కురిసినట్లు అయిందని అన్నారు. రాష్ట్రంలో అసంఘటిత కార్మికులు ఎదుర్కొంటున్న దయనీయ పరిస్థితులను, వారి ఆర్థిక ఇబ్బందులను ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు జి. సంజీవరెడ్డి గతంలోనే సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారని ఈ సందర్భంగా సత్యనారాయణ గుర్తుచేశారు. కార్మిక నేత విజ్ఞప్తిని సానుకూలంగా పరిశీలించి, తక్షణమే స్పందించి సరైన నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి చొరవ అభినందనీయమన్నారు. అసంఘటిత కార్మికులందరి తరఫున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, అలాగే కార్మికుల గళాన్ని వినిపించిన జాతీయ నేత జి. సంజీవరెడ్డికి ముత్యాల సత్యనారాయణ తమ ప్రకటన ద్వారా కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

సఖీ సెంటర్‌లో వనమహోత్సవం సందర్భంగా మొక్కలు నాటుతున్న రాష్ట్ర మహిళా కమీషన్ ఛైర్ పర్సన్ గద్వాల విజయలక్ష్మి.

మారేడ్‌పల్లి నెహ్రూ నగర్ పార్కులో పర్యావరణ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేష్

సీఆర్‌పీఎఫ్ గ్రూప్ సెంటర్లో మొక్కనాటి నీరు పోస్తున్న డీఐజిపి ఉదయ్‌భాస్కర్ బిల్లా, ఇతక అధికారులు

పపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న వ్యాపార వేత్త,ఫార్చ్యూన్ వన్ అధ్యక్షులు శ్రీనివాస్ బన్సల్

ఒక మొక్క అమ్మ పేరుతో కార్యక్రమంలో మొక్కలు నాటుతున్న బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు జి.భరత్ గౌడ్, మాజీ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ తదితరులు

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బిజెపి ఆధ్వర్యంలో శివరాంపల్లి ప్రజాభవన్ వద్ద ఏక్ పెడ్ మా కే నామ్ వృక్షారోపణ కార్యక్రమం నిర్వహించారు. రాజేంద్రనగర్ అధ్యక్షుడు పసుపుల సందీప్ ముదిరాజ్, హరికిషన్ జి, సోల్కర్ రెడ్డి, బండారి బాలకృష్ణ, డివిజన్ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, విజయ్ యాదవ్‌లు పాల్గొని మొక్కలు నాటారు.

పర్యావరణహితంగా నగరాభివృద్ధి జరగాలి : ప్రొఫెసర్ నాగేశ్వర్

సేవ్ హైదరాబాద్ అనే నినాదంతో నిర్వహించిన మానవహారంలో పాల్గొన్న ప్రొఫెసర్ కే.నాగేశ్వర్

ముషీరాబాద్, జూన్ 5, ప్రభాతవార్త: పర్యావరణ హితంగా నగరాభివృద్ధి జరగాలని, అప్పుడే ప్రజలకు, దీర్ఘకాలికంగా ఆర్థిక వ్యవస్థకు ఉపయోగపడుతుందని మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కే.నాగేశ్వర్ స్పష్టం చేశారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని, హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్‌పై మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ నాగేశ్వర్ హాజరై మాట్లాడుతూ ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ మాత్రమే కాదని, ఈజ్ ఆఫ్ లివింగ్ కూడా ఉండాలని అన్నారు. నగరీకరణ పెరుగుతున్నంత వేగంగా మౌళిక సదుపాయాల కల్పన జరగటం లేదని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు నిర్మాణాలలో గాలి, వెలుతురుకు ప్రాధాన్యత ఇవ్వాలని, అప్పుడే విద్యుత్ వినియోగం తగ్గుతుందని తెలిపారు. భూమి, గాలి, నీటి వనరులు కాలుష్యం అవుతున్నాయని, డ్రైనేజిని యధేచ్ఛగా మంచినీటి చెరువులలో వదులుతున్నారని, ఫలితంగా మంచినీటి వనరులు కలుషితం అవుతున్నాయని అన్నారు. అర్బన్ డెవలప్‌మెంట్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షన కోసం ప్రతి ఒక్క వ్యక్తికి వంద చెట్లు చొప్పున ఉండాలని, కానీ హైదరాబాద్ నగరంలో 18 చెట్లు మాత్రమే ఉన్నాయని అన్నారు. రోజు రోజుకు ప్రతి సం వత్సరం ఎండల తీవ్రత పెరుగుతోందని, దీనిని బట్టి కాలుష్యం ఏ స్థాయిలో పెరుగుతోందో అర్థం చేసుకోవచ్చునని అన్నారు. అర్బన్ ప్లానింగ్‌లో కూడా అనేక మార్పులు రావాలని, ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని, దానికోసం హెచ్‌సిఎఫ్‌యుడిఎఫ్ లాంటి పౌరసంస్థలు కృషి చేయాలని అన్నారు. హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం ప్రధాన కార్యదర్శి కే.వీరయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మల్లం రమేస్, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఆర్.మాణిక్, హెచ్‌సిఎఫ్ కార్యకర్తలు ఎం.శ్రీనివాసరావు, మోహన్‌నాయుడు, సంగీత, అస్మిత, లలిత, రితేష్, సుకుమార్, గోపాల్, మోహన్, నర్సింగ్‌రావు, శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటిని అందించడంలో ప్రభుత్వం విఫలం: ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

సికింద్రాబాద్, జూన్ 5 ప్రభాతవార్త:
ప్రజల కనీస అవసరమైన త్రాగునీటిని అందించడంలో కూడా ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీమంత్రి, సనత్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం పద్మారావు నగర్‌లోని బిల్వర్డ్ అపార్ట్ మెంట్ వద్ద 10 వేల సామర్థం కలిగిన వాటర్ ట్యాంకర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లాలకు సక్రమంగా నీరు సరఫరా కాకపోవడం, మరికొన్ని ప్రాంతాల్లో అసలుకే నీరు రాకపోవడంతో ప్రజలు ట్యాంకర్ లను బుక్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క పద్మారావు నగర్ ప్రాంతంలోనే రోజుకు 200 ట్యాంకర్లు నీటి కోసం బుక్ అవుతున్నాయంటే నీటి సమస్య తీవ్రత ఎంత మేరకు ఉందో అర్థం అవుతుందని పేర్కొన్నారు. నీటి కోసం ట్యాంకర్‌ను బుక్ చేసిన వారం రోజుల తర్వాత సరఫరా అవుతుంటే ప్రజలు తమ అవసరాలు ఎలా తీర్చుకోవాలని ప్రశ్నించారు. బిఆర్ఎస్ 10 సంవత్సరాల పాలనలో ఏ ఒక్కరోజు కూడా ప్రజలు త్రాగునీటి కోసం ఇబ్బందులు పడిన దాఖలాలు లేవని గుర్తు చేశారు. పద్మారావు నగర్ ప్రాంతంలో అత్యధికంగా అపార్ట్ మెంట్ లు ఉండటం వలన ఇక్కడ జనాభా కూడా అధికంగా ఉందన్నారు. వాటర్ వర్క్స్ విభాగం నుండి

కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

ప్రస్తుతం 5 వేల లీటర్ల సామర్థం కలిగిన ట్యాంకర్ ద్వారా సరఫరా అవుతున్నా, ఆ నీరు సరిపోకవడంతో వాటర్ వర్క్స్ ఎండితో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడి 10 వేల లీటర్ల సామర్థం కలిగిన ట్యాంకర్ ను మంజూరు చేయించారు. తమ త్రాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట వాటర్ వర్క్స్ సిజీఎం వినోద్, పద్మారావు నగర్ బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జి గుర్రం పవన్ కుమార్ గౌడ్, బిల్వర్డ్ అపార్ట్ మెంట్ అధ్యక్షులు జగ్గయ్య ముకుంద్, నాయుడు తదితరులు ఉన్నారు.

7వ తేదీన మెగా సైక్లింగ్ రైడ్

సంజీవరెడ్డి నగర్, జూన్ 5, ప్రభాతవార్త:
ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించే లక్ష్యంతో ఈ నెల 7వ తేదీన నగరంలో మెగా సైక్లింగ్ రైడ్ నిర్వహిం చనున్నట్లు హైదరాబాద్ సైక్లింగ్ క్లబ్ చైర్మన్, వరల్డ్ సైక్లింగ్ అలయన్స్ తొలి ఉపాధ్యక్షుడు డీవీ మనోహర్ తెలిపారు. శుక్రవారం బేగంపేటలోని ది మనోహర్ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమం ఔటర్ రింగ్ రోడ్ సైక్లింగ్ ట్రాక్‌లోని నార్సింగి స్మార్ట్‌బైక్ హబ్ వద్ద ప్రారంభం కానుంది. మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా హాజరై సైక్లింగ్ రైడ్‌ను జెండా ఊపి ప్రారంభించనున్నారు. 5 కిలోమీటర్లు, 10 కిలోమీటర్ల విభాగాల్లో 2,500 మందికి పైగా సైక్లిస్టులు పా ల్గొనే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు. భారతదేశంలో అతిపెద్ద పబ్లిక్ బైక్ షేరింగ్ సంస్థ స్మార్ట్‌బైక్ మొబిలిటీ ప్రైవేట్ లిమిటెడ్, ప్రపంచంలోనే అతిపెద్ద ఆన్‌లైన్ సైక్లింగ్ క్లబ్ హైదరాబాద్ బైసైక్లింగ్ క్లబ్ సంయుక్తంగా, బ్రస్సెల్స్‌కు చెందిన వరల్డ్ సైక్లింగ్ అలయన్స్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నాయి. ఈసారి తొలిసారిగా హైదరాబాద్, చండీగఢ్, న్యూఢిల్లీ నగరాల్లో ఏకకాలంలో ప్రపంచ సైకిల్ దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నారు. వరల్డ్ సైక్లింగ్ అలయన్స్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఫిట్ ఇండి యా సంస్థలు భాగస్వాములుగా వ్యవహరిస్తున్నాయి. మూడు నగరాల్లో కలిపి ఐదు వేల మందికి పైగా సైక్లింగ్ ఔత్సాహికులు పాల్గొంటారని అంచనా వేస్తున్నారు. చండీగఢ్‌లోని గవర్నమెంట్ మ్యూజియం అండ్ ఆర్ట్ గ్యాలరీ వద్ద జరిగే కార్యక్రమాన్ని కేంద్రపాలిత ప్రాంత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హెచ్. రాజేష్ ప్రసాద్ ప్రారం భించనున్నారు. న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగే వేడుకలకు ప్రముఖ నటుడు విక్రాంత్ మాస్సే, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియా ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన మరింత సమాచారం కోసం 9959154371, 9963980259 నంబర్లను సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు.

విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న దృశ్యం

ఆధునిక బోధనా పద్ధతులను అవలంబించాలి : డాక్టర్ సరోజ వివేక్

ఆకడమిక్ యాక్షన్ ప్లాన్ ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి సతీమణి, విద్యాసంస్థల కరెస్పొండంట్ డాక్టర్ సరోజ వివేక్

చిక్కడపల్లి జూన్ 5 (ప్రభాతవార్త) : బాగ్ లింగంపల్లి డాక్టర్ బి ఆర్ అంబెడ్కర్ విద్యాసంస్థలకు సంబంధించిన అకడమిక్ యాక్షన్ ప్లాన్ ను శుక్రవారం రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి సతీమణి, విద్యాసంస్థల కరెస్పొండంట్ డాక్టర్ సరోజ వివేక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ జి. సరోజా వివేక్ మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధే సంస్థ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. నాణ్యమైన విద్యను అందించేందుకు అధ్యాపకులు ఆధునిక బోధనా పద్ధతులను అవలంబించాలని సూచించారు. నిత్యం తరగతుల నిర్వహణ, విద్యార్థుల హాజరుపై ప్రత్యేక నిఘా, నెలవారీ మరియు అంతర్గత పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వహించడం ద్వారా విద్యా ప్రమాణాలను మెరుగుపరచవచ్చని పేర్కొన్నారు. యాక్షన్ ప్లాన్‌ను క్షేత్రస్థాయిలో కచ్చితంగా అమలు చేసి, విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించేలా అధ్యాపకులు ప్రత్యేక కార్యాచరణతో మార్గదర్శకత్వం వహించాలని పిలుపునిచ్చారు. అనంతరం సంస్థ సీఈఓ ప్రొఫెసర్ లింబాద్రి మాట్లాడుతూ అకడమిక్ యాక్షన్ ప్లాన్ అమలు తీరు, విభాగాలు మరియు శాఖాధిపతుల బాధ్యతలను సవివరంగా వివరించారు. నిర్దేశిత లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు.

బంజారాహిల్స్‌లో భార్యపై భర్త కత్తితో దాడి

జూబ్లీహిల్స్, జూన్ 5, ప్రభాతవార్త:
కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యపై భర్త కత్తితో దాడి చేసిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. ఫస్ట్ లాన్సర్‌లోని సయ్యద్ నగర్‌కు చెందిన షైజాది బేగం (35), బాజిత్ అజ్మత్ దంపతులు నివసిస్తున్నారు. బాజిత్ అజ్మత్ మద్యానికి బానిసై తరచూ కుటుంబ సభ్యులతో గొడవ పడుతుండేవాడు. ఈ నెల 4వ తేదీ మధ్యాహ్నం 2 గంటల సమయంలో మద్యం సేవించి ఇంటికి వచ్చిన అతడు భార్యను అసభ్య పదజాలంతో దూషించాడు. అనంతరం తన సోదరి ఇంటికి వెళ్లి, తిరిగి మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో ఇంటికి వచ్చి మరోసారి గొడవకు దిగాడు. ఈ క్రమంలో వంట గదిలో ఉన్న కూరగాయల కత్తిని తీసుకుని భార్య గొంతుపై దాడి చేసేందుకు ప్రయత్నించాడు. ప్రమాదాన్ని గమనించిన షైజాది బేగం తన కుడి చేతిని అడ్డంగా పెట్టుకోవడంతో కత్తి చేతికి తగిలి తీవ్ర గాయమైంది. దీంతో ఆమెకు రక్తస్రావం కావడంతో పాటు లోతైన గాయం ఏర్పడింది. దాడి నుంచి తప్పించుకున్న బాధితురాలు సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందింది. అనంతరం బంజారాహిల్స్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నేడు జలమండలి గుర్తింపు సంఘానికి ఎన్నికలు

- విస్తృతమైన ఏర్పాట్లు - పోలీసుల బందోబస్తు

చాంద్రాయణగుట్ట, జూన్ 5, ప్రభాతవార్త : హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సివరేజ్ బోర్డు (హెచ్ ఎండబ్ల్యూఎస్ఎస్‌బి)లో గుర్తింపు యూనియన్ కోసం శనివారం ఎన్నికలు జరుగనున్నాయి. ఇందు కోసం ప్రభుత్వ శాఖలు తగిన ఏర్పాట్లు చేశాయి. ఎన్నికల్లో తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ (టిజెఈయు), హైదరాబాద్ వాటర్‌వర్క్స్ అండ్ సివరేజ్ కామ్‌గార్ యూనియన్ల మధ్య ప్రధాన పోటీ ఏర్పడింది. వివిధ యూనియన్లు తమకు అనుకూలమైన ప్రధాన పక్షంవైపు చేరి మద్దతు పలికాయి. హైదరాబాద్ వ్యాప్తంగా జలమండలి కార్యాలయాలలో విస్తృతంగా ప్రచారం నిర్వహించాయి. తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్‌కు మద్దతుగా ముస్లీం ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఎంఈడబ్ల్యూఎ–మేవా), ఆల్ ఇండియ ట్రేడ్ యూనియన్ కౌన్సిళ్ల (ఎఐటియుసి) మద్దతుగా నిలిచాయి. త్రిశూలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఎంప్లాయిస్ యూనియన్ అభ్యర్థి మొగుళ్ల రాజిరెడ్డికి అనుకూలంగా ఎన్నికల ప్రచారం చేశారు. అదేవిధంగా కామ్‌గార్ యూనియన్ అభ్యర్థిగా రాంబాబు యాదవ్ బరిలో నిలిచారు. తన మద్దతుదారులతో కలిసి బాణం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారం గురువారం సాయంత్రంతో ముగిసింది. అలియాబాద్ జలమండలి కార్యాలయంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం 9గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. బాలాపూర్, మైసారం, అలియాబాద్, గౌలిపురా, బేలా చందూలాల్, మొఘలపురా (పాత) సెక్షన్ల పరిధిలోని 87 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోనున్నారు. శాలిబండ ఇన్‌స్పెక్టర్ పి.మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. సాయంత్రం ఎన్నికలు ముగిసిన తరువాత పోలింగ్ బాక్సులను పటిష్ట బందోబస్తు మధ్య ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయానికి తరలిస్తారు. అక్కడ ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

అలియాబాద్ జలమండలి కార్యాలయంలో పోటా పోటీగా బ్యానర్లు

ప్లాస్టిక్ వినియోగం తగ్గించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి : బిక్షపతి యాదవ్

నిజాంపేట్, జూన్ 5, ప్రభాతవార్త
ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రజలు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి పనిచేయాలని లుక్స్ గ్లోబల్ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ బిక్షపతి యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం ప్రపంచవ్యాప్తంగా నిర్వహించే పర్యావరణ దినోత్సవం ద్వారా ప్రకృతి సంరక్షణపై అవగాహన పెంపొందించడం ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ప్రకృతి మానవాళి మనుగడకు మూలాధారమని, గాలి, నీరు, నేల వంటి సహజ వనరులను సంరక్షి ంచడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. పెరుగుతున్న కాలుష్యం, ప్లాస్టిక్ వ్యర్థాలు, అటవీ నిర్మూలన, గ్లోబల్ వార్మింగ్ వంటి కారణాలతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణకు చట్టాలు ఉన్నప్పటికీ, వాటి అమలులో ప్రజల భాగస్వామ్యం కీలకమని తెలిపారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే నీరు, ఇంధన వనరులను పొదుపుగా వినియోగించడంతో పాటు ఒకసారి ఉపయోగించే ప్లాస్టిక్ వస్తువులను పూర్తిగా నివారించాలని సూ చించారు. మొక్కలు నాటడం, వర్షపు నీటి సంరక్షణ, పరిసరా ల పరిశుభ్రత, వన్యప్రాణుల రక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని కోరారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు సమిష్టిగా కృషి చేసినప్పుడే సుస్థిర అభివృద్ధి సాధ్యమవుతుందని బిక్షపతి యాదవ్ పేర్కొన్నారు. ప్లాస్టిక్ రహిత – పచ్చదన భారతం నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహ కరించాలని ఆయన పిలుపునిచ్చారు.

కంపెనీ సమాచారం చోరీకి యత్నం..

జూబ్లీహిల్స్, జూన్ 5, ప్రభాతవార్త:
జూబ్లీహిల్స్‌లోని ఓ ఔషధ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగి కంపెనీ రహస్య సమాచారాన్ని తన వ్యక్తిగత మొబైల్ ఫోన్‌లో చిత్రీకరించిన ఘటన వెలుగులోకి వచ్చింది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. ప్రాణ టవర్స్‌లో ఉన్న ఎమ్మార్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో మార్కెటింగ్ మేనేజర్‌గా పనిచేస్తున్న సీహెచ్ శ్రీధర్ బాబు కార్యాలయ నిబంధనలకు విరుద్ధంగా వ్యక్తిగత మొబైల్ ఫోన్‌ను కార్యాలయంలోకి తీసుకెళ్లాడు. సంస్థలో మొబైల్ ఫోన్లకు నిషేధం ఉండటంతో పాటు లాకర్ సౌకర్యం కల్పించినప్పటికీ అతడు నిబంధనలను ఉల్లంఘించినట్లు గుర్తించారు. కార్యాలయంలో రహస్య సమాచారాన్ని ఫోటోలు తీస్తున్నట్లు మరో ఉద్యోగి గమనించి ఐటీ విభాగానికి సమాచారం అందించాడు. అనంతరం సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించగా కార్యాలయంలో ఫోటోలు తీసినట్లు గుర్తించినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. అతడి మొబైల్‌ను తనిఖీ చేయగా అధికారిక ఈమెయిల్ సమాచారానికి సంబం ధించిన చిత్రాలు ఉన్నట్లు గుర్తించడంతో హెచ్‌ఆర్ విభాగం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బిఆర్ఎస్ హయాంలోనే కార్మిక హక్కుల అణిచివేత : మొగుళ్ళ రాజిరెడ్డి

చిక్కడపల్లి జూన్ 5 (ప్రభాతవార్త) :
రాష్ట్రంలో కార్మిక సంఘాలు లేకుండా చేసి, కార్మికుల హక్కులను కాలరాసిన ఘనత గత బిఆర్ఎస్ ప్రభుత్వానిదేనని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్ష అభ్యర్థి మొగుళ్ళ రాజిరెడ్డి తీవ్రస్థాయిలో ఆరోపించారు. శుక్రవారం బాగ్ లింగంపల్లిలోని వీఎస్‌టీ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలో ఉన్నప్పుడు కార్మిక సంఘాలను రద్దు చేసి, ప్రశ్నించిన కార్మికులపై కక్షసాధింపులకు పాల్పడిన బిఆర్ఎస్ నాయకులకు ఇప్పుడు కార్మికుల ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. ఆనాడు ఆర్టీసీ కార్మికులు 52 రోజులు సమ్మె చేస్తే పట్టించుకోని మాజీ మంత్రి హరీష్ రావు, ఇప్పుడు కార్మిక సంక్షేమంపై నీతులు పలకడం సిగ్గుచేటని విమర్శించారు. గత 12 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న జలమండలి కార్మికుల సమస్యలను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో పరిష్కరించారని రాజిరెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి. చంద్రశేఖర్, అధ్యక్షులు విజయ్ కుమార్ యాదవ్, జలమండలి ఎస్సీ, ఎస్టీ యూనియన్ అధ్యక్షులు శంకర్ ప్రకాష్, వీఎస్‌టీ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎల్.డి. పాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన టిప్పర్

ఒకరు మృతి, ఒకరికి గాయాలు

ఎల్.బి.నగర్, జూన్ 5 ప్రభాతవార్త:
ఆటోను టిప్పర్ వాహనం ఢీకొట్టిన సంఘటనలో ఒకరు మృతి చందగా మరొకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చైతన్యపురి జోయా లూకాస్ షోరూం ఎదురుగా అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. ఆటోను టిప్పర్ వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో జయరాజు(60) అక్కడికక్కడే మృతి చెందారు. ఆటో డ్రైవర్ పోచయ్యకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పేకాట స్థావరంపై పోలీసుల ఆకస్మిక దాడి

అత్తాపూర్ జూన్ 5,ప్రభాతవార్త :
అత్తాపూర్‌లోని డైమండ్ సిటీ కాలనీలో పేకాట స్థావరంపై పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. ఈ ఆపరేషన్‌లో జూదానికి పాల్పడుతున్న 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.43,000 నగదు, నాలుగు ద్విచక్ర వాహనాలు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసులు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు సిఐ నాగేశ్వర్ రావు తెలిపారు. నగరంలో అక్రమ జూద నిర్వాహకులపై కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.

స్నేహం పేరుతో మోసం.. బంగారు ఆభరణాలు స్వాహా

జూబ్లీహిల్స్, జూన్ 5, ప్రభాతవార్త:
స్నేహం పేరుతో పరిచయం పెంచుకుని ఓ వృద్ధుడి వద్ద ఉన్న 62 గ్రాముల బంగారు ఆభరణాలను కాజేసిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గచ్చిబౌలిలోని రాజీవ్‌నగర్‌కు చెందిన రాజం రాజయ్య ప్రకాష్ (70), రోడ్లుభవనాల శాఖలో రిటైర్డ్ ఉద్యోగి. ఏప్రిల్ నెలలో సికింద్రాబాద్ బస్ స్టాప్ వద్ద రాములు అనే వ్యక్తితో పరిచయం ఏర్పడి స్నేహంగా మారింది. ఇటీవల డబ్బు అవసరం కావడంతో తన వద్ద ఉన్న బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టాలని భావించిన ప్రకాష్, రాములును సంప్రదించాడు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ జ్యువెలర్స్ ద్వారా బంగారాన్ని తాకట్టు పెట్టిస్తానని రాములు నమ్మించాడు. దీంతో జూన్ 3న సాయంత్రం ఒక నెక్లెస్ (25 గ్రాములు), ఒక బ్రాస్‌లెట్ (30 గ్రాములు), ఒక ఉంగరం (7 గ్రాములు) మొత్తం 62 గ్రాముల బంగారు ఆభరణాలను బ్యాగులో పెట్టుకుని రాములును కలిశాడు. అనంతరం ఇద్దరూ ఆటోలో జూబ్లీహిల్స్ రోడ్ నంబర్36లోని శ్రీకృష్ణ జ్యువెలర్స్‌కు బయలుదేరారు. మార్గమధ్యలో రాములు మద్యం సేవించి తిరిగి ప్రయాణం కొనసాగించాడు. జ్యువెలర్స్ వద్దకు చేరుకున్న తర్వాత బంగారం ఉన్న బ్యాగ్‌ను తన వద్దకు తీసుకుని కొద్దిసేపు వేచి ఉండాలని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. తర్వాత ఫోన్‌లో కుటుంబ అత్యవసర పరిస్థితి కారణంగా మరుసటి రోజు బ్యాగ్ ఇస్తానని చెప్పినప్పటికీ, అనంతరం ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి కనిపించకుండా పోయాడు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గగన్‌పహాడ్‌లో ఆహార పదార్థాలు సీజ్

అత్తాపూర్ జూన్ 5,ప్రభాతవార్త : గగన్‌పహాడ్‌లోని ఓ ఆహార తయారీ కేంద్రంపై హెచ్‌ఫాస్ట్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. నిల్వ కేంద్రంలో బూజు పట్టిన మిరపకాయల బస్తాలపై పిల్లులు తిరుగుతుండటం, పురుగులు పట్టిన ధనియాలు, పావురాల రెట్టలు గుర్తించారు. అపరిశుభ్ర వాతావరణంలో ఉన్న దాదాపు 50 మెట్రిక్ టన్నుల ఆహార పదార్థాలను సీజ్ చేసి, తదుపరి చర్యల కోసం ఎఫ్ఎస్ఎస్ఏఐకి నివేదించారు.

ప్రజావసరాలు మేరకు అభివృద్ధి : ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

అల్వాల్, జూన్ 5 ప్రభాతవార్త: ప్రజావసరాలు మేరకు అభివృద్ధిని కొనసాగిస్తున్నామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వెంకటాపురం డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీలో 15లక్షలు వ్యయంతో ఏర్పాటు చేయనున్న డ్రైనేజీ పనులను మాజీ కార్పొరేటర్ సబిత అనీల్ కిషోర్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రజలు సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకుని రావాలని మర్రి రాజశేఖర్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో జలమండలి డిజిఎం వెంకటేష్, మేనేజర్ రమేష్ బిఆర్ఎస్ నేతలు అనీల్ కిషోర్, ప్రభాకర్, సురేష్, ముత్యాలు, సోమయ్య, ప్రకాష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్

పనులు పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్

అల్వాల్, జూన్ 5 ప్రభాతవార్త: ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం తన బాధ్యతని అల్వాల్ మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివవాస్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని మల్లిఖార్జున్ నగర్ కాలనీలో పర్యటించిన ఆమె అక్కడ జరుగుతున్న డ్రైనేజీ పనులను పరిశీలించారు. అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటానని, పరిశుభ్రతను పెంపొందించడం జరుగుతుందని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు శ్రీనివాస్, సాయి కిరణ్, మోహన్, అరుణ్ గిరి, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

అంధ విద్యార్థుల పాఠశాలలో మూల రాజ్ కుమార్ గౌడ్ జయంతి

-హాజరైన తలసాని,సాయికిరణ్ యాదవ్

బేగంపేట జూన్ 5,ప్రభాతవార్త

పేద అంధ విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం ఎంతో అభినందనీయమని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు.ఎమ్మెల్యే తలసాని వియ్యంకుడు,బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మూల రాజ్‌కుమార్ గౌడ్ జయంతి వేడుకలు శుక్రవారం బేగంపేట లోని దేవనార్ అంధ విద్యార్థుల పాఠశాలలో ఘనంగా జరిగాయి.అమీర్‌పేట కు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు బాబా,వేణుగౌడ్,శ్రీనివాస్‌గౌడ్,అభిలాష్ రెడ్డి,కిషోర్‌ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఎమ్మెల్యే తలసానితో పాటు సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఇంచార్జి తలసాని సాయికిరణ్ హాజరయ్యారు.ముందుగా రాజ్‌కుమార్ గౌడ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం రాజ్‌కుమార్ గౌడ్ కుమారుడు గౌతమ్ గౌడ్,మనవడు తారక్ లతో కల్సి కేక్ కట్ చేసారు.ఈ సందర్భంగా అంధ విద్యార్థులకు వారు స్వయంగా భోజనాలు వడ్డించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్లు టి.మహేశ్వరి,అత్తెల్లి మల్లిఖార్జున్‌గౌడ్,పార్టీ ముఖ్య నాయకులు టి.శ్రీహరి, నరేందర్,కిషోర్,ప్రవీణ్‌రెడ్డి,శేఖర్,సంజయ్ పాల్గొన్నారు.

నేరాల అదుపునకు ప్రత్యేక దృష్టిపెట్టాలి : సుమతి

కంటోన్మెంట్,జూన్ 5 ప్రభాతవార్త: శాంతి భద్రతల పరిరక్షణ, నేరాలు అదుపు చేసేందుకు పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టాలని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి తెలిపారు. శుక్రవారం అడ్డగుట్టలోని తుకారాంగేట్ పోలీస్ స్టేషన్‌ను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. రౌడీషీటర్లపై ప్రత్యేక దృష్టిపెట్టి వారి కదలికలపై ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఎన్ని కేసులు వస్తున్నాయని ఆరా తీశారు. శాంతి భద్రతలు,నేరాల అదుపు,పెట్రోలింగ్ వంటి అంశాలపై సలహాలు, సూచనలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రావ్,ఎస్ఐలు కిరణ్ కుమార్ రెడ్డి,యశోదర,రమ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రధమ చికిత్స అందించేందుకు కిట్లు పంపిణీ

ప్రధమ చికిత్స కిట్లు అందిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ శంకరరాజు.

బేగంపేట జూన్ 5,ప్రభాతవార్త

రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయంలో గాయపడిన వారికి చికిత్స అందించేందుకు ఫస్ట్‌ఎయిడ్ కిట్లను సమర్ధవంతంగా ఉపయోగించాలని తిరుమలగిరి ట్రాఫిక్ ఏసీపీ జి.శంకరరాజు అన్నారు.శుక్రవారం తిరుమల గిరి డివిజన్ పరిధిలో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ ఏసీపీ శంకరరాజు ప్రధమ చికిత్స కిట్లను పంపిణీ చేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు బధ్రత నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు.ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ సిగ్నల్స్,రాంగ్ రూట్లో వాహనాలు నడవవద్దని,మద్యం సేవించి డ్రైవింగ్ చేయవద్దన్నారు.సురక్షితమైన ట్రాఫిక్ వాతావరణం కల్పించడంలో ఆటో డ్రైవర్లు భాగస్వాములు కావాలని సూచించారు.అపోలో ఆసుపత్రి సహకారంతో ఈ ప్రధమ చికిత్స కిట్లను ఆటో డ్రైవర్లకు అందించామని అన్నారు.అపోలో ఆసుపత్రిలాగానే ఇతర ఆసుపత్రుల వారు కూడా ముందుకు వచ్చి ప్రధమ చికిత్స కిట్లను అందిస్తే డివిజన్ పరిధిలోని ఆటో డ్రైవర్లకు అందిస్తామని శంకరరాజు పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు,ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

సాయిబాబ నగర్‌లో పర్యటించిన మాజీ కార్పొరేటర్

అల్వాల్, జూన్ 5 ప్రభాతవార్త: ప్రజా సమస్యలు పరిష్కారానికి చిత్తశుద్ధితో పని చేస్తున్నామని మచ్చబొల్లారం మాజీ కార్పొరేటర్ జితేందర్‌నాథ్ పేర్కొన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని సాయి బాబ కాలనీలో పర్యటించిన స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, డ్రైనేజీ ఇతర సమస్యలను కాలనీ వాసులు జితేందర్‌నాథ్ దృష్టికి తెచ్చారు. సమస్యలు అన్నీ త్వరలోనే పరిష్కరం అవుతాయని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు సురేందర్ రెడ్డి, రాజసింహారెడ్డి, లడ్డు రెడ్డి, శ్రీశైల యం యాదవ్, దిడ్ల స్వామి, సంపత్ యాదవ్, కొండల్ రెడ్డి పాల్గొన్నారు.

పోక్సో కేసులో నేరస్తునికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

సరూర్‌నగర్, జూన్ 5 ప్రభాతవార్త: పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన పోక్సోకు సంబంధించిన కేసులో నిందితునిగా ఉన్న జల్‌పల్లి శ్రీరాం కాలనీలో నివసించే కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా బసవ కళ్యాణ్ తాలూకా రాజోలా గ్రామానికి చెందిన రాజేంద్ర (35)పై నేర అభియోగాలు నిర్ధారణ కావడంతో కోర్టు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షణను విధించింది. శ్రీరాం కాలనీలో అద్దెకు ఉంటూ కూలి పనులు చేసుకునే రాజేంద్రపై 2023లో మైనర్ బాలికపై అత్యాచారానికి సంబంధించిన పోక్సో కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో కేసు తుది విచారణ పూర్తి అయ్యి నిందితునికి నేరారోపణలకు సంబంధించి సాక్ష్యాధారాలు పరిశీలించిన రంగారెడ్డి జిల్లా ఫాస్ట్ ట్రాక్ స్పెషల్ కోర్టు న్యాయమూర్తి కె.పద్మావతి శుక్రవారం తీర్పు వెలువరించారు. నిందితుడు రాజేంద్రకు 20 సంవత్సరాల కఠిన జైలు శిక్షతో పాటు 20 వేల జరిమానా విధించారు. అదే విధంగా బాధితురాలి పునరావాసం కోసం రూ.3 లక్షలను అందజేయాలని ఆదేశించారు.

నవ్యతకు నాంది వ్యాసవైజయంతి గ్రంథం : డా. కె.వి.రమణాచారి

గ్రంథావిష్కరణ కావించి ప్రసంగిస్తున్న రమణాచారి, పద్మనాభరావు, లలితావాణి, రామచంద్రరావు తదితర అతిథులు

నాంపల్లి, జూన్ 5 ప్రభాతవార్త : మనకు తెలియని ఎన్నో విషయాలను సరళ సుందరం, పరిశోధనాత్మకంగా వ్యాసాల రూపంలో ప్రముఖ సాహితీమూర్తి పి.లలితావాణి అందించిన వ్యాసవైజయంతి నవ్యతకు నాంది అన్న తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి ఈ గ్రంథంలో మొత్తం 54 వ్యాసాలున్నాయని, వ్యాసాలు 5+4 అంటే 9 నవం, నవం అంటే ప్రణవం.. ప్రణవమంటే ఓంకారమని, ఈ గ్రంథం ఓంకారాన్ని సూచిస్తుందని ఆయన అన్నారు. శ్రీ కృష్ణదేవరాయ తెలుగు భాషానిలయం, సాహితీ జిగీష సాహితీ సాంస్కృతిక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఢిల్లీ దూరదర్శన్ విశ్రాంత అదనపు డీజి డా. రేవూరి అనంతపద్మనాభరావు సభాధ్యక్షతన తెలుగు భాషానిలయంలోని డా. రావిచెట్టు రంగారావు కళావేదికలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డా. కె.వి.రమణాచారి విశిష్ట అతిథులు డా. ఆచార్య ఫణీంద్ర, ఆచార్య టి.గౌరీశంకర్, డా. ఎం.దత్తాత్రేయశర్మ, రచయిత్రి డా. పులిగడ్డ లలితవాణి, సంస్థ అధ్యక్ష ఉపకార్యదర్శులు బండారుపల్లి రామచంద్రరావు, డా. పి.వి.ఉమాశశి, పి.విజయలక్ష్మి తదితరులతో కలిసి డా. పి.లలితవాణి రచించిన వ్యాస వైజయంతి గ్రంథాన్ని ఆవిష్కరించి రచయిత్రిని ఘనంగా సత్కరించి శుభాభినందనలు తెలిపారు. అద్భుత గ్రంథాన్ని ఆవిష్కరించుకోవడమే కాకుండా ముగ్గురు ప్రముఖులను పురస్కారాలతో సత్కరించడం శ్లాఘనీయమని అన్నారు. డా. ఆచార్య ఫణీంద్ర గ్రంథ పరిచయం చేశారు. చివరిగా ప్రతిష్ఠాత్మక సాహితీ జిగీష పురస్కారాలు డా. కదారి సత్యమూర్తికి ఉత్తమసేవా పురస్కారం; రఘుశ్రీకి ఉత్తమకవి పురస్కారం; ధూళిపాళ అరుణకు ఉత్తమ రచయిత్రి పురస్కారంలను ప్రదానం చేశారు.

వంజరి కులస్తులకు ఎస్టీ హోదా పునరుద్ధరించాలి

అభివాదం చేస్తున్న నేతలు కాలేరు సురేష్, కృష్ణ, శంకర్ నారాయణ,హరినాథ్, కాశీనాథ్, ,వెంకటేష్ తదితరులు

హైదరాబాద్, జూన్ 5,ప్రభాతవార్త:

తెలంగాణలో వంజరి కులస్తులకు గతంలో ఉన్న ఎస్టీ (షెడ్యూల్డ్ ట్రైబ్) హోదాను పునరుద్ధరించాలని, తక్షణ ఉపశమనంగా వారిని డి.ఎన్.టిగా గుర్తించాలని, అలాగే కుల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని అఖిల భారత వంజరి సేవా సంఘం, తెలంగాణ వంజరి సేవా సంఘం డిమాండ్ చేశాయి. శుక్రవారం హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ, 1978 వరకు ఎస్టీలుగా పరిగణించబడిన వంజరి కులస్తులను ఒక జీవో ద్వారా బీసీడి వర్గంలోకి మార్చడం వల్ల ఐదు దశాబ్దాలుగా తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కులగణనలో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని, ఆర్థికంగా వెనుకబడిన వంజరి కుటుంబాలను ఆదుకునేందుకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.వంజరి కుల ఆరాధ్య సంత్ అయిన భగవాన్ బాబా పుణ్యతిథిని అధికారికంగా నిర్వహించాలని, అలాగే ప్రముఖ రాజకీయ నాయకుడు గోపీనాథ్ ముండేకు భారతరత్న ప్రకటించి ఆయన జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈనెల 7న ఉప్పల్ బాగాయత్‌లో నిర్మించిన వంజరి కుల ఆత్మగౌరవ భవన ప్రారంభోత్సవానికి హాజరుకానున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్తో పాటు ఇతర ప్రజాప్రతినిధులు వంజరి కుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సంఘ నాయకులు కోరారు.ఉప్పల్ ఆత్మగౌరవ భవనం పూర్తిగా వంజరి కులస్తుల స్వంత నిధులతో నిర్మించబడిందని, గత ప్రభుత్వం ప్రకటించిన రూ.1 కోటి నిధులు ఇప్పటికీ విడుదల కాలేదని తెలిపారు. భవన అభివృద్ధి కోసం రూ.5 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే భవన నిర్మాణ ట్రస్టులో బీసీ సంక్షేమ శాఖ నిబంధనల ప్రకారం అన్ని నమోదిత వంజరి సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పదవీకాలం ముగిసినా ఇంకా పదవుల్లో కొనసాగుతున్న వ్యక్తుల ఆధిపత్యాన్ని నివారించేందుకు ప్రభుత్వం జోక్యం చేసుకుని సంఘానికి వెంటనే ఎన్నికలు నిర్వహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు సాల్వేరు కృష్ణ, ఎదుగని శంకర్ నారాయణ, ఎరుగని హరినాథ్, ధాత్రికా కాశీనాథ్, యుగంధర్, కాలేరు సురేష్, ఎదుగని వెంకటేష్, శివప్రసాద్, రత్నం సంతోష్, అముద లక్ష్మణ్, మహదేవ్ ముండే తదితరులు పాల్గొన్నారు.

ఇషా సింగ్‌ను అభినందించిన ఎమ్మెల్యే

ప్రపంచ రికార్డ్ సృష్టించిన షుటర్ ఇషా సింగ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

కంటోన్మెంట్,జూన్ 5 ప్రభాతవార్త: భారత షుటర్ (ఐఎస్.ఎస్.ఎఫ్)వరల్డ్ కప్ 43బై50 స్కోర్‌తో స్వర్ణ పతకం సాధించిన ఇషా సింగ్‌కు ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు.5వవార్డు రైల్వే కాలనీలో నివాసం ఉంటున్న ఇషా సింగ్ అనే మహిళా 25 మీటర్ల పిస్టల్ విభాగంలో 43బై 50 స్కోర్ సాధించి ప్రపంచ రికార్డును సృష్టించినందుకు శుక్రవారం ఎమ్మెల్యే ఆమె నివాసానికి వెళ్లి శాలువతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త తేలుకుంట సతీష్ గుప్త, ఆమె తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన జోనల్ కమిషనర్

అధికారులకు పలు సూచనలు చేస్తున్న దృశ్యం

జీడిమెట్ల, జూన్ 5, ప్రభాతవార్త

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం గాజులరామారం క్రీడా సముదాయంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పి. పింకేష్ కుమార్ పాల్గొని, గాజులరామారం డిప్యూటీ కమిషనర్ వెంకట్రాములు, అర్బన్ బయోడైవర్సిటీ ఉప సంచాలకులు, ఉప కార్య నిర్వాహక ఇంజనీర్లు, మేనేజర్ తదితర అధికారులతో కలిసి మొక్కలు నాటారు. మొక్కలు నాటిన అనంతరం స్వయం సహాయక సంఘాల మహిళలతో కలిసి జోనల్ కమిషనర్ పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉండాలంటూ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గాజులరామారం, దేవేందర్ నగర్ ప్రాంతాల్లోని శ్మశాన వాటికలను పరిశీలించిన ఆయన, అక్కడ అవసరమైన ప్రాథమిక వసతులను ప్రాధాన్యత ఆధారంగా కల్పించాలని అధికారులను ఆదేశించారు. తదుపరి హెచ్ఎం టీ సొసైటీ, రోడా మేస్త్రీ నగర్ ప్రాంతాల్లో కొనసాగుతున్న జనగణన పనులను పరిశీలించిన జోనల్ కమిషనర్, ప్రక్రియను మరింత వేగవంతం చేసి జూన్ 9వ తేదీలోగా పూర్తి చేయాలని ఎన్యూమరేటర్లకు సూచించారు.

స్థలాన్ని ఆక్రమించుకున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి

కంటోన్మెంట్,జూన్ 5 ప్రభాతవార్త: పోలీసు అధికారినని చెప్పుకుంటూ తమ స్థలాన్ని అక్రమించుకొని భవనం నిర్మాణం చేపడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని స్థల యజమానులు అరుణ,స్టాన్లీలు తెలిపారు. తిరుమలిరిలోఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ కంటోన్మెంట్ 7వ వార్డులోని ఎస్.పి.కాలనీలోని ప్లాట్ నెం.11కు చెందిన 180 చదరపు గజాల స్థలాన్ని ఓ వ్యక్తి అక్రమించుకొని బోర్డు అనుమతులు తీసుకోకుండా నిబంధనలకు విరుద్ధంగా గృహ నిర్మాణం పనులు చేపడుతున్నారని తెలిపారు. ఈ విషయంపై మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి, తి రు మలగిరి సిఐ,కంటోన్మెంట్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమణ దారుడు తన బైక్‌కు పోలీస్ అధికారిగా స్టిక్కర్ వేసుకొని స్థలం వద్ద కుర్చొని స్థల యజమానికి భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని తెలిపారు.

పాండు బస్తిలో నాలా సమస్యల పరిశీలన

పనులను పరిశీలిస్తున్న దృశ్యం

జీడిమెట్ల, జూన్ 5, ప్రభాతవార్త

సాయిబాబా నగర్ డివిజన్ పరిధిలోని పాండు బస్తిలో డిప్యూటీ కమిషనర్ లావణ్య, స్థానిక మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డితో కలిసి పర్యటించారు. గత కొంతకాలంగా నాలాలో డీసిల్టింగ్ చేసిన మట్టిని అక్కడి నుంచి తొలగించకపోవడంతో అది తిరిగి నాలాలో కలుస్తున్న పరిస్థితిని గుర్తించిన మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, ఈ విషయాన్ని డిప్యూటీ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి ప్రత్యక్షంగా పరిశీలించాలని కోరారు. దీనిపై స్పందించిన డిప్యూటీ కమిషనర్ లావణ్య శుక్రవారం ఉదయం పాండు బస్తిలోని నాలాను సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. డీసిల్టింగ్ అనంతరం సిల్ట్‌ను వెంటనే తరలించకపోవడంపై సంబంధిత అధికారులను హెచ్చరించిన ఆమె, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రాంతంలో పారిశుద్ధ్య నిర్వహణ, నాలాల సంరక్షణ విషయంలో నిర్లక్ష్యం వహించకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డిప్యూటీ కమిషనర్ సూచించారు.

నారీ శక్తి అవార్డ్స్-2026

నారీ శక్తి అవార్డ్స్‌లో పాల్గొన్న మహిళలు

సంజీవరెడ్డి నగర్, జూన్ 5, ప్రభాతవార్త:

దేశవ్యాప్తంగా వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించి, నాయకత్వం, ధైర్యసాహసాలు, సామాజిక ప్రభావాన్ని చాటిన మహిళలను నారీ శక్తి అవార్డ్స్ 2026 కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. గోఆధ్ ఫౌండేషన్, భారత్ కే అన్మోల్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లోని హోటల్ మారిగోల్డ్‌లో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. దేశ నిర్మాణం, సామాజిక అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం ఎంత ముఖ్యమో ఈ కార్యక్రమం ద్వారా ప్రతిఫలించింది.ఈ కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా భారత్ కే అన్మోల్ వ్యవస్థాపకుడు డా. మొహమ్మద్ నిజాముద్దీన్ చేతుల మీదుగా "నారీ శక్తి ఫోరమ్" ప్రారంభమైంది. మహిళా నాయకత్వం, సాధికారత, మార్గదర్శకత్వం, సామాజిక భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే వేదికగా ఈ ఫోరమ్ పనిచేస్తుందని ఆయన తెలిపారు.డా. మొహమ్మద్ నిజాముద్దీన్, భారత్ కే అన్మోల్ సంస్థ చేపట్టిన సామాజిక కార్యక్రమాలు, వారి ప్రయాణం, లక్ష్యాలను ప్రతిబింబించే ప్రత్యేక ఆడియో విజువల్ ప్రదర్శనతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో సానుకూల మార్పుకు ప్రేరణగా నిలుస్తున్న మహిళల సేవలను గుర్తించి గౌరవించడానికే నారీ శక్తి అవార్డ్స్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. మహిళా సాధికారత కేవలం సామాజిక లక్ష్యం మాత్రమే కాకుండా జాతీయ అవసరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి సీనియర్ బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి, జర్మనీ గౌరవ కాన్సుల్ అమితా దేశాయ్, ట్యునీషియా గౌరవ కాన్సుల్ షబానా సుల్తానా, యురేషియా ఆఫ్రో చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ డా. రోహిత్ గుప్తా, డా. గీతా సింగ్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

గాగిలాపూర్, నాగులూరులో ప్రజాసమస్యలపై ఈటల రాజేందర్ పర్యటన

స్థానికులతో మాట్లాడుతున్న ఈటెల

దుండిగల్, జూన్ 5, ప్రభాతవార్త

296వ డివిజన్ పరిధిలోని దుండిగల్ తండా, చర్చి గాగిలాపూర్, గాగిలాపూర్ గ్రామం, నాగులూరు గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలనే ఉద్దేశంతో శుక్రవారం మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్, మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు డా.ఎస్. మల్లారెడ్డి పర్యటించారు.ఈ సందర్భంగా చర్చి గాగిలాపూర్ 214 ప్రాంతంలో ప్రధానంగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని స్థానికులు వారి దృష్టికి తీసుకువచ్చారు. అలాగే గాగిలాపూర్ గ్రామంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవల కోసం ఆసుపత్రి సౌకర్యం కల్పించాలని కోరారు.నాగులూరు గ్రామంలో రోడ్లు, రేషన్ దుకాణం, డ్రైనేజీ వ్యవస్థ, స్మశానవాటిక, పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని గ్రామస్తులు వివరించారు. పేరుకే జీహెచ్ఎంసీలో విలీనం చేసినప్పటికీ, గ్రామంలో మౌలిక వసతులు పల్లెటూర్ల కంటే దారుణంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజలు తెలిపిన సమస్యలను పరిశీలించిన ఈటల రాజేందర్, సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి విఘ్నేశ్వరచారి, రాష్ట్ర ఎస్టీ మోర్చా నాయకులు శామ్ రావు, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు గోనె మల్లారెడ్డి, దుండిగల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి తురాయి భాను గౌడ్, ఉపాధ్యక్షురాలు రోజా, సీనియర్ నాయకులు ఆకుల మల్లేష్, మలోత్ వెంకటేష్ నాయక్, శ్రీనివాస్ యాదవ్, విజయ్ నాయక్, శ్రీనివాస్ నాయక్, భాస్కర్ నాయక్, యువమోర్చా నాయకులు ఆకుల విజయ్, తలారి రాజ్‌కుమార్, ఆకుల యశ్వంత్, గాగిలాపూర్ చిన్న, నవీన్, మధు, సాయి నాగులర్, విష్ణు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

హుస్సేన్‌సాగర్‌లో ఉత్సాహంగా సెయిలింగ్ ఛాంపియన్‌షిప్

హైదరాబాద్ జూన్ 5, ప్రభాతవార్త:

హుస్సేన్‌సాగర్ వేదికగా జరుగుతున్న 27వ మాన్‌సూన్ రెగట్టా నేషనల్ ర్యాంకింగ్ సెయిలింగ్ చాంపియన్‌షిప్ నాలుగో రోజు రేసుల్లో తెలంగాణ డిఫెండింగ్ నేషనల్ చాంపియన్ రవికుమార్ అద్భుత ప్రదర్శనతో లీడర్‌బోర్డ్‌లో అగ్రస్థానానికి దూసుకెళ్లాడు. శుక్రవారం చివరి రేసులో ఆరంభం నుంచి ముగింపు వరకు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి క్లీన్ విన్ సాధించాడు. మరో తెలంగాణ సెయిలర్ వుట్ల నరసింహ ఓవరాల్‌గా రెండో స్థానంలో నిలవగా, అండర్15 బాలికల విభాగంలో అగ్రస్థానంలో ఉన్న ఎస్కే రమీజా భాను ఓవరాల్‌గా మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. శనివారం చివరి రెండు రేసులు మిగిలి ఉన్నందున ప్రతిష్ఠాత్మక మాన్‌సూన్ రెగెట్టా ట్రోఫీ కోసం రవికుమార్, నరసింహల మధ్య టైట్ ఫైట్ నడుస్తోంది. ఈ నెల ఆఖర్లో మొరాకోలో జరగనున్న వరల్డ్ చాంపియన్‌షిప్‌నకు ఇండియా జట్టు తరఫున ఎంపికైన 14 ఏళ్ల రవికుమార్ ప్రయాణం అత్యంత స్ఫూర్తిదాయకం. నారాయణపేటకు చెందిన రవికుమార్ కుటుంబం తీవ్ర పేదరికంలో మగ్గింది. రోజువారీ కూలీలైన తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందుల వల్ల 2022లో రవికుమార్ తమ్ముడికి కనీస వైద్యం కూడా అందించలేక కోల్పోయారు. ఆ తీరని శోకాన్ని, ఆర్థిక కష్టాలను దిగమింగుతూ "ది యాచ్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్" లో కఠిన శిక్షణ పొందిన రవికుమార్.. నేడు నేషనల్ చాంపియన్‌గా ఎదిగి ప్రపంచ టోర్నీల్లో ఇండియాకు ప్రాతినిధ్యం వహించే స్థాయికి చేరుకున్నాడు. "మాన్‌సూన్ రెగట్టా, హుస్సేన్‌సాగర్ నాకు హోమ్ గ్రౌండ్స్ లాంటివి. ఇక్కడ నా శిక్షణ బాగా సాగింది, కానీ నా పూర్తి ఫోకస్ అంతా మొరాకో వరల్డ్స్ లో అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడం పైనే ఉంది" అని 14 ఏళ్ల రవికుమార్ తెలిపాడు.మాన్‌సూన్ రెగట్టా చరిత్రలోనే ఇంత కఠినమైన, ప్రతి పొజిషన్ కోసం ఇంత గట్టి పోటీ జరిగిన రేసులను నేను ఎప్పుడూ చూడలేదు. చివరి రోజు వరకు విజేత ఎవరనేది ఉత్కంఠగా మారిందిఖీ అని తెలంగాణ సెయిలింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుహైమ్ షేక్ తెలిపారు.

జాతీయ కథల పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

కార్యక్రమంలో పాల్గొన్న వేదకుమార్, ఏ పి గ్రంథాలయ పరిషత్ ప్రతినిధి డాక్టర్ రావి శారద

చిక్కడపల్లి , జూన్ 5 (ప్రభాతవార్త) : బాలల్లో సృజనాత్మకతను వెలికితీస్తూ, బాలసాహిత్య వికాసానికి తోడ్పడుతున్న బాలచెలిమి సంస్థ ఆధ్వర్యంలో జాతీయ బాలల కథల పురస్కారాల-2025 ప్రధానోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. హిమాయత్‌నగర్ లో ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్‌లో నిర్వహించిన ఈ సభకు బాలచెలిమి వ్యవస్థాపకులు మణికొండ వేదకుమార్ అధ్యక్షత వహించగా, తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డా. రియాజ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. దేశవ్యాప్తంగా వచ్చిన కథలను నిపుణులైన జ్యూరీ సభ్యుల బృందం పరిశీలించి, మూడు విభాగాల్లో (పెద్దలు రాసిన బాలల కథలు, యువత రాసిన బాలల కథలు, పాఠశాల విద్యార్థులు రాసిన కథలు) మొత్తం 36 మంది ఉత్తమ విజేతలను ఎంపిక చేసింది. విజేతలకు అతిథుల చేతుల మీదుగా పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రియాజ్ చేతుల మీదుగా నూతన గ్రంథాలయాల కొరకు పుస్తకాల సెట్లను కూడా పంపిణీ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ప్రతినిధి డాక్టర్ రావి శారద మాట్లాడుతూ పుస్తకాలు లేని ఇల్లు, కిటికీలు లేని ఇల్లు లాంటిది. పుస్తకాలను ప్రేమించడం, చదవడం, రాయించడం గొప్ప విషయం. బాలచెలిమి గ్రంథాలయాలు విద్యార్థుల సృజనను అద్భుతంగా వెలికితీస్తున్నాయని కొనియాడారు. ముఖ్య అతిథి డాక్టర్ రియాజ్ మాట్లాడుతూ సమాజ శ్రేయస్సుకు బాలచెలిమి సంకలనాలు ఎంతో తోడ్పడతాయన్నారు. సభకు అధ్యక్షత వహించిన మణికొండ వేదకుమార్ మాట్లాడుతూ 2019 నవంబర్ 20న పోచంపల్లిలో మొదటి గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశామని, కరోనా కష్టకాలంలోనూ మాస్కులు ధరించి బాలచెలిమి గ్రంథాలయాలు పనిచేశాయని గుర్తుచేశారు. కన్వీనర్ గరిపల్లి అశోక్ ఆధ్వర్యంలో గ్రంథాలయాల స్థాపనను విస్తృతం చేశామన్నారు. ప్రస్తుతం 10 జిల్లాల బడిపిల్లల కథలు, పెద్దల సాహితీవేత్తల కథల సంకలనాలను ప్రచురించామని, తాజాగా మరో 20 నూతన గ్రంథాలయాలను ఏర్పాటు చేశామని తెలిపారు. జాతీయ స్థాయి పోటీల కథలను కూడా పుస్తకరూపంలో బాలచెలిమి ద్వారా ప్రచురిస్తున్నట్లు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో కన్వీనర్ గరిపల్లి అశోక్, కోఆర్డినేటర్ సయ్యద్ ఖైజర్, చిత్రకారులు కూరెళ్ళ శ్రీనివాస్, ధనుంజయ, మాడభూషి లలితా దేవి, డాక్టర్ రఘు, గజిటెడ్ హెచ్ఎం కొమ్మవరపు కృష్ణమ, ప్రవీణ్ శర్మ, పైడిమర్రి గిరిజ, అమ్మిన శ్రీనివాస రాజు, అమరవాది నీరజ, పుప్పాల కృష్ణమూర్తి, భీంపల్లి శ్రీకాంత్, వడ్డేపల్లి వెంకటేష్, హస్మతుల్లా, బైతి దుర్గయ్య, రాజమౌళితో పాటు పలువురు న్యాయ నిర్ణేతలు, గ్రంథాలయ నిర్వాహకులు, పురస్కార గ్రహీతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యువ రచయితలను ప్రోత్సహిస్తూ, సుసంస్కృత సమాజ నిర్మాణానికి తోడ్పడే సందేశంతో కార్యక్రమం ముగిసింది

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

: ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్

జూ పార్కులో మొక్కలు నాటుతున్న బహదూర్‌పుర ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్

చార్మినార్,జూన్ 5 ప్రభాతవార్త : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కులో బహదూర్‌పుర నియోజకవర్గం ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యాన్ని కాపాడేందుకు ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని తెలిపారు.జూ పార్కులో పలు చోట్ల పెద్ద ఎత్తున మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో జూపార్కు క్యూరేటర్ జె.వసంత,డిప్యూటీ క్యూరేటర్ జె.మురళీధర్,జూపార్కు వైల్డ్‌లైప్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్. ఎంఎ హకీం,అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి,పిఆర్ఓ హెచ్ఎం హనీఫ్,జెడ్ఇఒ సిహెచ్ దీపక్ తరుణ్,మాజీ కార్పొరేటర్ మహ్మద్ ఖదీర్‌తో పాటు జూ పార్కు అధికారులు పాల్గొన్నారు.

హైడ్రా ఆధ్వర్యంలో పాతబస్తీలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం

చార్మినార్,జూన్ 5 ప్రభాతవార్త :

హైదరాబాద్ పాతబస్తీ మదీనా చౌరస్తా వద్ద శుక్రవారం డిఆర్ఎఫ్ జీరో నైన్,చార్మినార్ సర్కిల్ జీరో నైన్, చార్మినార్ జోన్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం కార్యక్రమం జరిగింది. హైడ్రా ఉద్యోగులు,సిబ్బంది మదీనా సర్కిల్ వద్ద మన చెరువులు మన భవిష్యత్తు,అగ్ని ప్రమాదాన్ని నివారిద్దాం- అమూల్యమైన ప్రాణాన్ని కాపాడుదాం,హైడ్రాతో కలిసి చెరువులను రక్షిద్దాం,సేవ్ వాటర్ సేవ్ లైఫ్ అంటూ ప్ల కార్డులనుప్రదర్శించారు.హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఓ పద్మయ్య, మార్షల్ రాజవర్ధన్ రెడ్డి,డిఎఫ్ఆర్ టీమ్ మేనేజర్ కరుణాకర్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఉమ్మడి రాష్ట్రంలో కంటే తెలంగాణలోనే బిసిలకు అన్యాయం

-రెండు రాష్ట్రాల్లోనూ అగ్రకుల ఆధిపత్యమే : జాజుల శ్రీనివాస్‌గౌడ్

ప్రెస్‌క్లబ్‌లో అభివాదం చేస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్, గుజ్జకృష్ణ ,విక్రంగౌడ్, కుల్కచర్ల శ్రీనివాస్ తదితరులు

హైదరాబాద్, జూన్ 5,ప్రభాతవార్త:

గత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కంటే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే బీసీలకు ఇంకా ఎక్కువ అన్యాయం జరుగుతూనే ఉందని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాలుగా విడిపోయిన తర్వాత రెండు రాష్ట్రాల్లోనూ బీసీల పరిస్థితి పెనం మీద నుండి పొయ్యిలో పడ్డ చందంగా ఉందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ తమ రాజకీయ విశ్లేషణలో భాగంగా జనసేన పార్టీపై వ్యతిరేకంగా మాట్లాడరనే భావనతో ప్రొఫెసర్ నాగేశ్వరరావు పై ఏపీ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టడాన్నీ తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.ఇదే సమయంలో తెలంగాణ ఉద్యమకారులు నిరసన తెలిపిన సందర్భంగా వారికి కౌంటర్‌గా ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలంగాణ మీ అయ్యా జాగీరా అంటూ మాట్లాడడాన్నీ తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. తక్షణమే ఈ వాక్యాలను పవన్ కళ్యాణ్ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కాసోజు శ్రీకాంతచారి నుండి కానిస్టేబుల్ కృష్ణయ్య వరకు, కొండ లక్ష్మణ్ బాబూజీ నుండి మొదలుకొని ప్రొఫెసర్ జయశంకర్ వరకు బీసీలే రాష్ట్రం రావడానికి ప్రధాన కారణమయ్యారని, సకలజనుల సమ్మె, విద్యార్థి జేఏసీ, ధూమ్ దాం లతో తెలంగాణ రాష్ట్ర ఉద్యమాన్ని ఉధృతం చేసింది బహుజన వర్గాలేనని, త్యాగాలు బీసీ ఎస్సీ ఎస్టీలు చేస్తే ఈరోజు వచ్చిన తెలంగాణ రాష్ట్రంని పిడికెడు శాతం లేని అగ్ర కులాలు అనుభవిస్తున్నారని ఆయన తెలిపారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో తెలంగాణ ప్రాంతం నుండి బీసీ ఎమ్మెల్యేల సంఖ్య 24 మంది ఉంటే తెలంగాణ వచ్చిన తర్వాత 19 మందికి తగ్గారని, మంత్రివర్గంలో తెలంగాణ నుండి ఐదుగురు బీసీలు మంత్రులుగా ఉంటే తెలంగాణ వచ్చిన తర్వాత ముగ్గురుకి తగ్గారని, తెలంగాణ వచ్చిన తర్వాత యువజనులు, అడవులు, పాడి పరిశ్రమ శాఖలు కేటాయించి బీసీలను అవమానించారని ఆయన అన్నారు, ఈ సమావేశంలో బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, కో చైర్మన్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, అధికార ప్రతినిధి తాటికొండ విక్రమ్ గౌడ్, కో చైర్మన్ ఉప్పరి శేఖర్ సగర, మహిళా జేఏసీ వైస్ చైర్మన్ స్వర్ణ గౌడ్, బీసీ జేఏసీ నాయకులు వెంకటేష్ గౌడ్, గూడూరు భాస్కర్ మేరు, సమతా యాదవ్, గౌతమి, ఇంద్రం రజక, వనజ,అనంతుల సాయి, బండిగారి భరత్ గౌడ్ పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం

సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్

EE-II (60-మేడ్చల్), కుత్బుల్లాపూర్ జోన్

ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

నిట్ నం. 08/EE-60/QBZ/CMC/2026-27, తేది: 05.06.2026. ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంపై ప్రచురింపబడింది. వివరాలను https://tender.eprocurement.gov.in లాగిన్ అవటం ద్వారా చూడవచ్చును. తేదీల వివరాలు క్రింద వివరింపబడినవి. నిట్ నం. పైన పేర్కొన్నది. పని పేరు: 1) చైన్ లింక్ మెష్ ఏర్పాటు-1 పని, 2) సెవరేజ్ డ్రెయిన్ వేయుట-1 పని, అంచనా మొత్తం లక్షలలో: 54.70, బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ (ప్రారంభ తేదీ & సమయం)/ బిడ్ దాఖలు ముగింపు తేదీ & సమయం: 08.06.2026 మ.2.00 గం. నుండి 15.06.2026 మ.2.00 గం.కు. అధికారి పేరు & చిరునామా సెల్ నం: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, కుత్బుల్లాపూర్ జోన్, సెల్ నం: 7995468066. సంబంధిత అధికారి చిరునామా: శ్రీ సుబ్రమణ్య SVRNRD, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, 60-మేడ్చల్, కుత్బుల్లాపూర్ జోన్, CMC. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ https://tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, సర్కిల్-60, QBZ, CMC

DIPR.No.3654-PP/CL/Advt/1/2026-27, తేది: 05.06.2026

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి భాద్యత

మొక్కను నాటిన డీసీ సంపత్ కుమార్

హయత్ నగర్, జూన్ 5 ప్రభాతవార్త : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మక చేపడుతున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళిక, ప్రపంచ పర్యావరణ దినోత్సవ వనమహోత్సవం లో భాగంగా శుక్రవారం నాగోల్ సర్కిల్ పరిధి పెద్ద అంబర్ పేట్ వార్డులోని రాజశ్రీ విద్యా మందిర్ లో డిప్యూటీ కమిషనర్ సంపత్ కుమార్ విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అన్నారు. ప్రజలంతా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు కాలుష్యాని నివారించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గీతీదీ డిప్యూటీ మేనేజర్ ఆర్.శ్రీనివాస్, కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి

-మాజీ కార్పొరేట్ బొక్క భాగ్యలక్ష్మి

ముసారాంబాగ్ కృష్ణ తులసి నగర్ కమ్యూనిటీ హాల్‌లో మొక్కలు నాటుతున్న మాజీ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి ్క చిత్రంలో రమేష్ రెడ్డి, కొప్పుల దినేష్ తదితరులు

మలక్ పేట, జూన్ 5, ప్రభాతవార్త: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మూసారంబాగ్ డివిజన్ మాజీ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకునిబీజేపీ మూసారంబాగ్ డివిజన్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడీ 12 సంవత్సరాల సుపరిపాలనను పురస్కరించుకొని " మా కే నామ్ పే ఏక్ పెడ్" (అమ్మ పేరుతో ఒక మొక్క) కార్యక్రమం లో ఆమె పాల్గొని ముసారాంబాగ్ కృష్ణ తులసి నగర్ కమ్యూనిటీ హాల్ ప్రాంతంలో చెట్ల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని, ప్రకృతిని మనం కాపాడితే అది మనల్ని కాపాడుతుందని పేర్కొన్నారు. సహజ వనరుల సంపదను భవిష్యత్ తరాలకు మనం అందించాలని కోరారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నివారించే ప్రతిజ్ఞ తీసుకుందమని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు గౌర దేవేందర్, రమేష్ రెడ్డి, రాము యాదవ్, యాదగిరి సురేందర్, కొప్పుల దినేష్, తులసి, పరశురాం, కిరణ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి తిరుకల్యాణ మహోత్సవం

నేరెడ్ మెట్ జూన్ 5, ప్రభాతవార్త : వినోభా నగర్‌లోని శ్రీ శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని తిరుకల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తిరుకల్యాణ మహత్యాన్ని భక్తులకు వివరించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు, జీవితకాల సభ్యులు, దాతలు, భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. 400 మందికి పైగా భక్తులు ఉత్సాహంగా పాల్గొని స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించి ఆశీర్వాదాలు పొందారు. కాగా, ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు కల్యాణ వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు దేవస్థాన కమిటీ ప్రకటించింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరింది. బ్రహ్మోత్సవాల నిర్వహణకు భక్తులు నగదు లేదా వస్తు రూపంలో సహకరించాలని దేవస్థాన కమిటీ విజ్ఞప్తి చేసింది.

వికలాంగుల సంక్షేమాన్ని విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం : చేరుకు నాగభూషణం



సమావేశంలో మాట్లాడుతున్న చెరుకు నాగభూషణం తదితరులు

మలక్ పేట, జూన్ 5, ప్రభాతవార్త: కాంగ్రెస్ ప్రభుత్వం వికలాంగుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తుందని కాంగ్రెస్ ఎన్నికల మనిఫెస్టో అమలు సాధన సమితి చైర్మన్ చెరుకు నాగభూషణం పేర్కొన్నారు. మలక్ పేట లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు దివ్యాంగుల సంక్షేమం, అభివృద్ధి, ఇతర కార్యక్రమాలు కోసం ప్రకటించిన మానిఫెస్టో లో హామీల్లో ఏ ఒక్కటి కూడా నెరవేర్చక పోవడం వికలాంగుల వర్గాన్ని మోసం చేయడమేనని ఆరోపించారు. వికలాంగుల పెన్షన్ ను పెంచుతామని చెప్పి ఇప్పటివరకు పెంచలేదని పేర్కొన్నారు. వికలాంగుల చట్టం 2016 గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు మన పటిష్టంగా అమలు చేయడం, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను వికలాంగులకు వర్తింప చేయడం లాంటి తదితర హామీలు నెరవేర్చలేదని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని తక్షణమే హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీల అమలు కోసం అసెంబ్లీ ముట్టడి, సామూహిక నిరాహార దీక్షలతో పాటు పలు నిరసన కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని వివరించారు. రానున్న రోజులలో వికలాంగ వర్గంతో పాటు ఇతర అన్ని వర్గాలతో కలిసి ప్రజాస్వామ్య బద్ధంగా ముందుకెళ్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో మొక్కలు నాటిన జడ్జిలు

హయత్ నగర్, జూన్ 5 ప్రభాతవార్త : ప్రపంచం పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని హయత్ నగర్ బార్ అసోసియేషన్, మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో హయత్ నగర్ లోని కోర్టు ఆవరణలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సిరిసిల్ల ప్రియాంక, అదనపు జూనియర్ సివిల్ జడ్జి పర్వీన్ బేగం మొక్కలను నాటారు. కార్యక్రమంలో మార్నింగ్ కోర్టు జడ్జి భరత్ రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లె లింగం గౌడ్, రామ్మోహన్ పాల్గొన్నారు.

కోహెడలో అంతర్జాతీయ సమీకృత మార్కెట్‌కు శంకుస్థాపన

-దేశంలోనే అతిపెద్ద మార్కెట్‌గా రూపుదిద్దుకోనున్న కోహెడ ప్రాజెక్ట్ -మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

తుర్కయంజాల్, జూన్ 5 ప్రభాతవార్త రాష్ట్ర రైతాంగానికి దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూర్చడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అంతర్జాతీయ సమీకృత మార్కెట్ ప్రాజెక్టు కోహెడలో రూపుదిదుకోనుంది. దేశంలోనే అతిపెద్ద సమీకృత మార్కెట్‌గా నిలిచే ఈ ప్రాజెక్టుకు శనివారం సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూమి పూజ చేసి శంకుస్థాపన చేయనున్నారు. ఈ నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తొర్రూర్ డివిజన్ కోహెడలో శుక్రవారం జరుగుతున్న ఏర్పాట్లను రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి ప్రభుత్వ ఉన్నతాధికారులు శుక్రవారం పరిశీలించారు. వివిధ శాఖల అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించి సీఎం పర్యటన, సభా నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని ఈ భారీ ప్రాజెక్టును చేపడుతోందన్నారు. సుమారు రూ.2,200 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ మార్కెట్ దేశవ్యాప్తంగా వ్యవసాయ మార్కెటింగ్ రంగానికి ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. మార్కెట్ నిర్మాణానికి సంబంధించిన తొలి దశ మౌలిక సదుపాయాల పనులను డిసెంబర్ లేదా జనవరి నాటికి పూర్తి చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. అనంతరం దశలవారీగా నిర్మాణ కార్యక్రమాలు చేపట్టి మూడేళ్లలో మొత్తం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందన్నారు. ఈ సమీకృత మార్కెట్ ద్వారా పండ్లు, కూరగాయలు, ధాన్యాలు, పూలు, మాంసాహార ఉత్పత్తులు, ఇతర వ్యవసాయ ఆధారిత వస్తువులు ఒకే వేదికపై క్రయవిక్రయాలు జరిగేలా ప్రత్యేక సదుపాయాలు కల్పించనున్నట్లు చెప్పారు. అంతేకాకుండా నిల్వ గోదాములు, కోల్డ్ స్టోరేజీలు, ప్రాసెసింగ్ యూనిట్లు, ఎగుమతిదిగుమతి కేంద్రాలు, రవాణా సౌకర్యాలు వంటి ఆధునిక మౌలిక వసతులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర రైతుల శ్రేయస్సు, వినియోగదారుల సౌకర్యమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష ్యమని మంత్రి స్పష్టం చేశారు. రైతులు తమ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర పొందడంతో పాటు దేశ, విదేశీ మార్కెట్లకు నేరుగా చేరుకునే అవకాశాలు ఈ మార్కెట్ ద్వారా కలుగుతాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగా రైతాంగం పలు ఇబ్బందులు ఎదుర్కొంటోందని మంత్రి తుమ్మల విమర్శించారు. అలాంటి పరిస్థితుల్లో రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. రైతుల సమస్యలపై ప్రతిపక్షాలు రాజకీయాలు చేయడం సరికాదని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యమే మౌలిక వసతుల కొరతకు కారణమైందని ఆరోపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ, భారతదేశ మార్కెట్ చరిత్రలో కొత్త అధ్యాయానికి కోహెడ వేదిక కాబోతోందన్నారు. రూ.2,200 కోట్లతో ప్రారంభమవుతున్న ఈ ప్రాజెక్టు అవసరమైతే మరో రూ.2,000 కోట్ల అదనపు నిధులు కేటాయించేందుకు కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను ఈ మార్కెట్‌కు తీసుకువచ్చి ప్రపంచంలోని వివిధ దేశాలకు ఎగుమతి చేసే అవకాశం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతు నుంచి వినియోగదారుడి వరకు అందరికీ ప్రయోజనం చేకూరేలా మార్కెట్ రూపకల్పన జరుగుతోందని వివరించారు. ఇప్పటికే హైదరాబాద్‌కు అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చిన శంషాబాద్ విమానాశ్రయం, ఔటర్ రింగ్ రోడ్ వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏర్పడ్డాయని గుర్తు చేశారు. ఇప్పుడు కోహెడలో నిర్మించనున్న అంతర్జాతీయ సమీకృత మార్కెట్ కూడా హైదరాబాద్ నగర అభివృద్ధి చరిత్రలో మరో కలికితురాయిగా నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, భాస్కర్ చారి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంక్షేమానికి ప్రభుత్వం అండ : ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

ఎల్.బి.నగర్, జూన్ 5 ప్రభాతవార్త: ప్రైవేట్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగ సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారు ఉప్పల శ్రీనివాస్‌గుప్త పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో ఉద్యమంలో సేవలందించిన ఉపాధ్యాయులు, ప్రైవేట్ విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ప్రైవేట్ టీచర్స్ విభాగం అధ్యక్షులు అజయ్‌కార్తీక్ నేతృత్వంలో నాగోల్ ఉప్పల శ్రీనివాస్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సత్కార సభ నిర్వహించారు. సభకు ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని కొనియాడారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలనలో అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారని, ప్రైవేట్ ఉద్యోగుల సంక్షేమం కోసం కూడా ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరిస్తోందని తెలిపారు. తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గంధం రాములు మాట్లాడుతూ ప్రైవేట్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు అందరూ ఐక్యంగా ఉంటూ సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యోగుల హక్కుల సాధన, సంక్షేమం కోసం సంఘం నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగ సంఘం రాష్ట్ర కోశాధికారి చంద్రశేఖర్‌ముదిరాజ్, విద్యాశాఖ విభాగం కోఆర్డినేటర్ ముప్పూరి కుమార్, వ్యాయామ ఉపాధ్యాయ విభాగం నాయకులు కిరణ్‌కుమార్, నక్క నాగరాజు, మొయిజ్, సుధాకర్, సమదు, చారి, అక్బర్, మహిళా నాయకులు రేణుక, సంధ్య, శ్వేత, వరలక్ష్మి, షేక్‌అమిదా, అమీనాసుల్తానా తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన గాలి, నీరు బహుమతిగా అందించాలి:చిలుక

మొక్కలు నాటుతున్న చిలుక ఉపేందర్‌రెడ్డి

ఎల్.బి.నగర్, జూన్ 5 ప్రభాతవార్త: రాబోయే తరానికి స్వచ్ఛమైన గాలి, నీరు, మంచి వాతావరణం బహుమతిగా ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్ శ్రీరామకృష్ణాపురం కాలనీ పార్కులో పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఉద్యానవన పట్టణ అభివృద్ధి డైరెక్టర్ సునందతో కలిసి శుక్రవారం చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు నాటిన ప్రతి మొక్క రేపటి తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించే అమూల్యమైన సంపదన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు వెంకటేశ్వర్లు, సాయికుమార్, శ్యామ్‌సుందర్, అన్నపూర్ణ, పట్టణ అభివృద్ధి సర్కిల్ అధికారి లోకేష్, నరహరిరావు, హేమాద్రి, విద్యాసాగర్, హరీష్, రాజన్, విజయలక్ష్మి, సుజాత, కల్పన, శకుంతల, విద్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్‌లో సిఎం పర్యటనకు భారీగా ఏర్పాట్లు : వజ్రేష్ యాదవ్

ఉప్పల్ భగాయత్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, మల్‌రెడ్డి రాంరెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

ఉప్పల్, జూన్ 5 ప్రభాతవార్త : ఉప్పల్ భగాయత్‌లో ఈ నెల 7వ తేదీన రూ.99 కోట్ల వ్యయంతో నిర్మించనున్న మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ నూతన కార్యాలయ భవన నిర్మాణానికి భూమి పూజ మరియు పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమానికి విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఉప్పల్ భగాయత్‌లో నిర్మించ తలపెట్టిన ఎంఎంసి భవనం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, రంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షులు చల్ల నర్సింహా రెడ్డి, తెలంగాణ రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివచరణ్ రెడ్డి, ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి, పోగుల నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉప్పల్ భగాయత్‌లో జరుగుతున్న ఏర్పాట్లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన వేదిక, ప్రజా సౌకర్యాలు, పార్కింగ్, భద్రతా ఏర్పాట్లు మరియు ఇతర ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో మల్కాజిగిరి నియోజకవర్గం అభివృద్ధి దిశగా వేగంగా అడుగులు వేస్తోందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి పనులను వేగవంతం చేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం. పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ మల్కాజిగిరి ఎంపిగా రేవంత్‌రెడ్డికి ఇక్కడి సమస్యలపై అవగాహన ఉందని, అభివృద్ధి పనులకు వేల కోట్ల నిధులు ఇచ్చారని తెలిపారు. మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి ముందు చూపుతోనే అభివృద్ధి చేపడుతున్నారని తెలిపారు. మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ మాట్లాడుతూ, గతంలో ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కారం చూపుతోందని, నూతన ఎంఎంసి భవనం నిర్మాణం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన పరిపాలనా సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడానికి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు శివారు ప్రాంత కాంగ్రెస్ పార్టీ నేతలు, మాజీ కార్పొరేటర్లు, పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వినయ్‌నగర్‌లో మొక్కలు నాటిన అధికారులు

మొక్కలు నాటుతున్న జోనల్ కమీషనర్ సత్యనారాయణ, డిసి భాస్కర్‌రెడ్డి

సైదాబాద్, జూన్ 5 ప్రభాతవార్త: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఐఎస్ సదన్ డివిజన్ వినయ్‌నగర్‌లోని వినాయకుడి దేవాలయం పక్కన ఉన్న పార్కులో రుద్రాక్ష, మామిడి, జామున్, పనస చెట్లను నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జోనల్ కమీషనర్ సత్యనారాయణ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డిసి భాస్కర్‌రెడ్డి, అసిస్టెంట్ కమీషనర్ నరహరి, యుబిడి డిప్యూటీ డైరెక్టర్ దేవుజా, యుబిడి మేనేజర్ భాస్కర్, యుబిడి హార్టికల్చర్ అసిస్టెంట్ ఉషశ్రీ, మధు, దేవాలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మాతృమూర్తి పేరిట ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటండి : బద్ధం మహిపాల్‌రెడ్డి

తులసి ముఖేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో మంత్రాల చెరువు వద్ద మొక్కలు నాటిన రాష్ట్ర బిజెపి ప్రధాన కార్యదర్శి బద్ధం మహిపాల్‌రెడ్డి

సరూర్‌నగర్, జూన్ 5 ప్రభాతవార్త: ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన ఏక్ పేడ్ మా కే నామ్ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ తమ మాతృమూర్తి పేరిట మొక్కను నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని తెలంగాణ రాష్ట్ర బిజెపి ప్రధాన కార్యదర్శి బద్ధం మహిపాల్‌రెడ్డి కోరారు. దేశ ప్రధానిగా నరేంద్ర మోడీ, బిజెపి ప్రభుత్వం విజయవంతంగా పుష్కర కాలం (12 సంవత్సరాలు) పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న విజయోత్సవాల్లో వచ్చిన ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మీర్‌పేట్ సెక్టార్-2 బిజెపి అధ్యక్షుడు తులసి ముఖేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో స్థానిక మంత్రాల చెరువు వద్ద స్వచ్ఛ భారత్, మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరై బద్ధం మహిపాల్‌రెడ్డి మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అందెల శ్రీరాములు యాదవ్, తెలంగాణ బిజెపి కో-ఆపరేటివ్ సెల్ రాష్ట్ర కార్యదర్శి, సింగిల్ విండో మాజీ చైర్మన్ కొలన్ శంకర్‌రెడ్డిలతో పాటు పలువురు పార్టీ నేతలతో కలిసి స్థానిక చెరువు పరిసరాలను శ్రమదానం ద్వారా శుభ్రం చేసి మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రకృతిని కాపాడుకోవడం అందరి బాధ్యత అన్నారు. కాలుష్య కారకాలైన వాటి వాడకాన్ని తగ్గించాలని ఆయన సూచించారు. దేశాభివృద్ధికి కృషి చేస్తున్న ప్రధాని మోడీ పిలుపును గౌరవిస్తూ అందరూ తమ తల్లుల పేరిట మొక్కలు నాటాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రంగా రెడ్డి జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు గుర్రం మల్లారెడ్డి, యెల్మేటి దేవేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు పాలమూరి విజయలక్ష్మి రాజు, రాత్లావత్ నీలా రవినాయక్, మీర్‌పేట్ సెక్టార్ -1 బిజెపి అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ పసునూరి బిక్షపతి చారి, కీసరి గోవర్ధన్‌రనెడ్డి, మద్ది రాజశేఖర్‌రెడ్డి, రామిడి వీరకర్ణారెడ్డి, ధరంకార్ కిశోర్, చిలంపల్లి రాజశేఖర్ కురుమ, వెంకటేశ్వర్‌రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

జిల్లెలగూడ వెంకటేశ్వర స్వామి దేవాలయ హుండీ ఆదాయం రూ.2,24,429

సరూర్‌నగర్, జూన్ 5 ప్రభాతవార్త: తెలుగు రాష్ట్రాల్లోనున్న పురాతన దేవాలయాల్లో ఉత్తర ద్వారం ఉన్న అరుదైన దేవాలయంగా గుర్తింపు పేరొందిన రంగారెడ్డి జిల్లా (జిహెచ్‌ఎంసి పరిధి) మహేశ్వరం నియోజకవర్గంలోని జిల్లెలగూడ గ్రామంలో గల శ్రీ మత్స్యావతార వెంకటేశ్వర స్వామి దేవస్థానం హుండీల లెక్కింపు శుక్రవారం జరిగింది. ఆలయ వ్యవస్థాపక కుటుంబానికి చెందిన వంశపారంపర్య ట్రస్టీ, దేవాలయ చైర్మన్ రాజా సంజయ్ గోపాల్ సైంచర్ అనుమతి మేరకు ఆలయ కార్యనిర్వహణాధికారి వై.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక మాజీ కార్పొరేటర్ బొక్క రాజేందర్‌రెడ్డి, మాజీ ధర్మకర్త చింతపట్ల జ్ఞానేశ్వరచారి, ఆలయ జూనియర్ అసిస్టెంట్ గొడిసె శ్రీకాంత్, ముఖ్య పూజారి రాఘవాచార్యులు, ప్రధాన పూజారి డింగరి రామాచారి, ఉమా మహేశ్వర ఆలయం (శివాలయం) పూజారి రాకేష్ పంతులు, శ్రీవారి ఆలయ సిబ్బంది నర్ర అశోక్, పలువురు భక్తుల సమక్షంలో ప్రధాన ఆలయంతో పాటు ఉప ఆలయాల హుండీలను తెరిచారు. పర్యవేక్షకులుగా హాజరైన రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ దేవస్థానం ఇఓ మోహన్‌రావు సమక్షంలో జరిగిన హుండీల లెక్కింపు సందర్భంగా 81 రోజులకు సంబంధించి మొత్తం ఆదాయం రూ.2,24,429 వచ్చింది. ఆలయ సిబ్బంది, పూజారులు, శ్రీవారి సేవకులు హుండీల లెక్కింపు జరిపారు. లెక్కింపు పూర్తయిన తర్వాత ఆలయ అధికారిక రిజిష్టర్‌లో వివరాలు నమోదు చేసిన అనంతరం సదరు మొత్తాన్ని ఆలయ ఖాతా ఉన్న గాయత్రీనగర్ ఎస్‌బిఐ బ్యాంకులో జమ చేశారు.

రాష్ట్ర సీనియర్ వాటర్ పోలో జట్టుకు అనిరుధ్ ఎంపిక



మల్కాజిగిరి జూన్ 5 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర వాటర్ పోలో జట్టుకు ఎల్. అనిరుధ్ ఎంపికయ్యారు. అనిరుధ్ ప్రస్తుతం కొల్లూరు లోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ లో ఇంటర్ చదువుతున్నారు. సీనియర్ నేషనల్స్ వాటర్ పోలో జట్టుకు ఎంపిక ట్రయల్స్ 2026 మే 24న అంబర్‌పేట్ లోని జీహెచ్‌ఎంసీ స్విమ్మింగ్ పూల్‌లో 11వ తెలంగాణ సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ నిర్వహించారు. రాష్ట్ర జట్టుకు అనిరుధ్ ఎంపిక కావడాన్ని స్ట్రోక్స్ స్విమ్మింగ్ స్కూల్ యజమాని చెరుకూరి భరత్, వినయ్, ఇన్‌చార్జ్ ప్రసాద్, స్ట్రోక్స్ హెడ్ కోచ్ మేనేజర్ ముఖ్తార్ అహ్మద్, గచ్చిబౌలి ఆక్వాటిక్ స్టేడియం స్విమ్మింగ్ కోచ్ పి.తిరుపతి యాదవ్ , ఇంచార్జి ఆయుష్ యాదవ్ అభినందించారు. ఎల్. అనిరుధ్ 2026 జూలై 7 నుంచి జూలై 12 వరకు చెన్నైలోని ఎస్ఆర్ఎం ఐఎస్‌టి, కట్టాంకులతూర్‌లో ఉన్న డా. టీ.కే. పారివేదర్ ఆక్వాటిక్ కాంప్లెక్స్‌లో నిర్వహించనున్న 79వ సీనియర్ నేషనల్ ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్ (వాటర్ పోలో)లో తెలంగాణ రాష్ట్రాన్ని వాటర్ పోలో జట్టు తరుపున ఆడతారు.

అందుబాటులోకి సిటీ స్కాన్ సేవలు

వనస్థలిపురం జూన్5, ప్రభాతవార్త పది రోజుల క్రితం వనస్థలిపురం డివిజన్ బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు చింతల రవి కుమార్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో సిటీ స్కాన్ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంటనే హాస్పిటల్ సూపరింటెండెంట్ నాగేందర్‌తో ఫోన్‌లో మాట్లాడి, సిటీ స్కాన్ పరికరాన్ని త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించడం జరిగింది. దీని ఫలితంగా గత ఆరు నెలలుగా వినియోగంలో లేకుండా ఉన్న సిటీ స్కాన్ యంత్రం నేడు ప్రజలకు అందుబాటులోకి రావడం జరిగింది. వనస్థలిపురం డివిజన్ బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు చింతల రవి కుమార్ ఆధ్వర్యంలో చేసిన నిరంతర కృషికి, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి చొరవతో పాటు హాస్పిటల్ సూపరింటెండెంట్ నాగేందర్ సహకారం తోడవడంతో ఈ సేవలు పునఃప్రారంభం కావడం ఎంతో అభినందనీయమని బి.ఆర్.ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ నాయకులు వర్కింగ్ ప్రెసిడెంట్ లాగోని శ్రీధర్ గౌడ్, దూసరి మధు గౌడ్, డివిజన్ బి.ఆర్.ఎస్ మహిళా అధ్యక్షురాలు లత ఆనంద్ రాజ్, కిషోర్ కుమార్, విజయ్, మహిళా నాయకులు పద్మ, శ్రీలత, వెన్నెల, మమత బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత

సైదాబాద్‌లో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్సీ ఏవిఎన్‌రెడ్డి, బిజెపి నాయకులు

సైదాబాద్, జూన్ 5 ప్రభాతవార్త: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్రమోడి పిలుపు మేరకు బిజెపి భాగ్యనగర్ జిల్లా ఆధ్వర్యంలో సైదాబాద్‌లో మొక్కలు నాటారు. ఎమ్మెల్సీ ఏవిఎన్‌రెడ్డి, సైదాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి, బిజెపి సీనియర్ సిటిజన్ సెల్ కన్వీనర్ సుభాష్ చందర్జీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు కొత్తకాపు రవీందర్‌రెడ్డి, జిల్లా బిజెపి అధ్యక్షులు నిరంజన్ యాదవ్, మాజీ కార్పొరేటర్ కూసూరు సహదేవ్ యాదవ్‌లు ఈ సందర్భంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్లాస్టిక్ భూతాన్ని తరిమి వేయాలన్నారు. రాష్ట్రాన్ని ఆకుపచ్చగా తీర్చుదిద్దుకోవడం అందరి బాధ్యత అని అన్నారు.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ఆందోళనకరం

-మొక్కల పెంపకమే పరిష్కారం : సామ రంగారెడ్డి

వనస్థలిపురం జూన్5, ప్రభాతవార్త ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నందనవనంలోని హనుమాన్ దేవస్థానంలో హస్తినాపురం డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఎరుకల మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో మొక్కల నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎల్బీనగర్ బీజేపీ పార్టీ ఇన్‌చార్జ్ మరియు మేడ్చల్ జిల్లా రూరల్ ఇన్‌చార్జ్ శ్రీ సామ రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ...ఈ సంవత్సరం హైదరాబాద్ నగరంలో అత్యధికంగా 43.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కావడం వాతావరణ మార్పుల తీవ్రతకు నిదర్శనమని అన్నారు. తెలంగాణలోని పలు జిల్లాల్లో 45 నుండి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవడంతో పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకం మరియు నీటి సంరక్షణ యొక్క ప్రాముఖ్యత మరింత పెరిగిందని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రభుత్వాలతో పాటు ప్రజలు కూడా స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని, ముఖ్యంగా మేధావులు, విద్యావంతులు మరియు యువత పెద్ద ఎత్తున మొక్కల నాటే కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బొగ్గుల మాధవ రెడ్డి , గజ్జల రాజ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి గౌని వెంకటేష్ గౌడ్, విజయ్ శ్రీ, జీవన్ రెడ్డి, కంది శ్రీనివాస్ రెడ్డి, నీల , గోవర్ధన్ యాదవ్ ,మల్లేష్ యాదవ్, బాలరాజు, శివకుమార్,, సోమిరెడ్డి మునీల్ నాయక్, లక్ష్మీకాం త్ రెడ్డి, టెంపుల్ చైర్మన్ శ్రీకాంత్, భాను ప్రకాష్, అరవింద్, పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జలమండలి ఎండి అశోక్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, గడ్డం సాయికిరణ్ తదితరులు

రామంతాపూర్, జూన్ 5 ప్రభాతవార్త : రామంతాపూర్ వెంకట్ రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని వెంకట్ రెడ్డి నగర్, రాంరెడ్డి నగర్, వాసవి నగర్ కాలనీలలో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు వెంకట్ రెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, బీజేపీ సీనియర్ గడ్డం సాయికిరణ్ ఆధ్వర్యంలో పలువురు కాలనీ ప్రతినిధులు కలిసి సమస్యల జలమండలి ఎండి అశోక్‌రెడ్డికి వివరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ వెంకట్ రెడ్డి నగర్, రామ్ రెడ్డి నగర్, వాసవి నగర్ పరిధిలో డ్రైనేజీ పనులను వెంటనే చేపట్టాలని జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడి ఆదేశించినట్లు తెలిపారు. రాంరెడ్డి నగర్ వాసవి నగర్ కాలనీల్లోని అంతర్గత రోడ్ల నిర్మాణం, ఇతర సమస్యలపై తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కాలనీలో తాగునీరు కలుషితం కావడంతో ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై ఎంపి ఈటల రాజేందర్ కూడా సమర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పిసరి శంకర్, సుదీర్శన్ రెడ్డి, ఆవుల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.